RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 165 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం,డిసెంబర్,21,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 165 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday,December,21,2025 | PAGES : 8 RS : 4 /- |


## డిసెంబర్ ఒక మిరాకిల్

**హైదరాబాద్,డిసెంబర్,20,తెలంగాణ దిశ :**
ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి జరుపుకునే పండుగగా క్రిస్మస్.. ద్వేషించే వారికి కూడా ప్రేమించే గుణాన్ని ఏసు ప్రభువు మానవాళికి స్ఫూర్తిగా అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా డిసెంబర్ ఒక మిరాకిల్ మంత్‌గా మారిందని వ్యాఖ్యానించారు. రాజకీయం గా భారీ మూల్యం చెల్లించి, ఆంధ్రప్రదే శ్‌లో పార్టీకి నష్టం జరిగినప్పటికీ సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, గతంలో సోనియా గాంధీ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ను తీసుకొచ్చి పేదలకు భరోసా కల్పించారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈరోజు తెలంగాణలో తమ ప్రభుత్వం పేదలకు దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. అలాగే, విద్య, వైద్యం లాంటి కీలక సేవలను ప్రభుత్వంతో సమానంగా క్రిస్టియన్ మిషనరీలు కూడా పేదలకు అందిస్తూ, సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రశంసించారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, సేవ, త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుంది.. ఆ విలువలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.




### క్రిస్మస్ పండుగ ప్రేమ, సేవ, త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుంది!

ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి..

## ఢిల్లీని కప్పేసిన పొగ మంచు..

### 100 ఫ్లైట్స్ క్యాన్సిల్.. 50 రైళ్లు ఆలస్యం



**న్యూఢిల్లీ,డిసెంబర్,20:**దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన పొగమంచు కప్పేసింది. మధ్యాహ్నం దగ్గర పడుతున్నా వెలుతురు లేదు. పూర్తిగా దృశ్యమానత పడిపోయింది. జోరో స్థాయికి కాంతి పడిపోయింది. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో దట్టంగా పొగ మంచు కప్పేసింది. దీంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. మనుషులు కనిపించలేదని పరిస్థితులు దాపురించాయి. ప్రస్తుతం వాతావరణం పరిస్థితి బాగోలేక పోవడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టు అప్రమత్తం అయింది. దాదాపు 100కు పైగా విమానాలు రద్దయ్యాయి. 50 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రగతి మైదాన్, భైరత్ మార్గ్, ఆనంద్ విహార్‌లో దృశ్యమానత తగ్గిపోయింది. మధ్యాహ్నం అవుతున్న కూడా వాహనదారులు హెడ్‌లైట్లు ఉపయోగించి డ్రైవింగ్ చేస్తున్నారు. ఇక ఎయిర్‌పోర్టులకు వచ్చే ప్రయాణికులు వెబ్‌సైట్‌ను చెక్ చేసుకోవాలని విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచించాయి. క్యాన్సిల్ అయిన విమాన ప్రయాణాలు మార్చుకోవచ్చని.. పూర్తి వాపసు కూడా ఇస్తామని చెప్పాయి

## అగ్నివీరులకు శుభవార్త..

### బీఎస్ఎఫ్ నియామకాల్లో రిజర్వేషన్ కోటా పెంపు



**న్యూఢిల్లీ,డిసెంబర్,20:**
అగ్నివీరులకు కేంద్రం శుభవార్త చెప్పింది. సరిహద్దు భద్రతా దళంనియామకాల్లో అగ్నివీరులకు సంబంధించిన నిబంధనలను సవరిస్తూ కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో ఇప్పటివరకు 10 శాతంగా అగ్నివీరుల రిజర్వేషన్ కోటాను 50 శాతానికి పెంచినట్లు పేర్కొంది. మొదటి దశలో మాజీ అగ్నివీరులకు కేటాయించిన 50 శాతం ఖాళీలకు, రెండో దశలో మాజీ అగ్నివీరులు కాకుండా మిగిలిన (పది శాతం మాజీ సైనికులతో సహా) ఖాళీలకు నియామకాలు నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. మొదటి దశలోని ఒక నిర్దిష్ట విభాగంలో మాజీ అగ్నివీరులతో కాకుండా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపింది. త్రివిధ దళాల్లో నియామకాలకు సంబంధించి 2022 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అగ్నివీరులుగా వారి నాలుగేళ్ల సర్వీస్ ముగిసిన అనంతరం రిజర్వేషన్ ద్వారా కేంద్ర పారామిలిటరీ బలగాల్లో వారిని నియమించుకుంటున్నారు. ఇందులో భాగంగానే గతంలో అన్ని కేంద్ర సాయుధ పోలీసు దళాలలోని కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఖాళీలలో 10 శాతం కోటా మాజీ అగ్నివీరులకు కేటాయించారు. అయితే తాజా నోటిఫికేషన్‌లో.. అగ్నివీరులకు 50 శాతం రిజర్వేషన్ కోటాను ఇతర కేంద్ర పారామిలిటరీ దళాల్లో కాకుండా కేవలం బీఎస్ఎఫ్ నియామకాల్లో మాత్రమే అమలు చేస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం మాజీ అగ్నివీరులకు శారీరక సామర్థ్య పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వగా.. రాత పరీక్షలో వారు ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

## మోడీ హెలికాప్టర్‌కు ప్రతికూల వాతావరణం.. దారి మళ్లింపు




**కోల్‌కతా,డిసెంబర్,20:**ప్రధాని మోడీ పశ్చిమబెంగాల్ పర్యటనలో ప్రతి కూల వాతావరణం ఇబ్బందికి గురి చేసింది. గత కొద్దిరోజులుగా పొగ మంచు కారణంగా ఆయా రాష్ట్రాలు కొట్టిమిట్టాడుతున్నాయి. అయితే శనివారం ప్రధాని మోడీ పశ్చిమ బెంగాల్ పర్యటనకు వెళ్లారు. ప్రధాని ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు ప్రతికూల వాతావరణం ఇబ్బంది పెట్టింది. దీంతో హెలికాప్టర్ తహెర్‌పూర్‌లో నియమించబడిన హెలిప్యాడ్‌లోకాకుండా కోల్‌కతాఎయిర్ పోర్టులోల్యాండ్ అయింది.అయితే అనుకూల పరిస్థితులు వచ్చేంతవరకు విమానాశ్రయంలోనే ప్రధాని ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే తిరిగి వెళ్లారా? లేదా? అనేది క్లారిటీ రాలేదు. ఉదయం 10.40 గంటలకు కోల్‌కతా చేరుకున్న ప్రధాని మోడీ.. హెలికాప్టర్‌లో నాడియా జిల్లాలోని తాహెర్‌పూర్‌కు బయల్దేరారు. హైవే ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంది. అలాగే బీజేపీ పరివర్తన్ సంకల్ప సభలో కూడా పాల్గొని ప్రసంగించాల్సి ఉంది. అయితే ప్రతికూల వాతావరణం ఉండడంతో హెలికాప్టర్ తిరిగి కోల్‌కతాలో ల్యాండ్ అయిపో యింది.ఇటీవలే ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ సర్వే చేపట్టింది. దాదాపు 58 లక్షల ఓట్లను ఈసీ తొలగించింది. వచ్చే ఏడాది ప్రారంభంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల జరగనున్నాయి. ఈసీ తొలి ఓటర్ ముసాయిదా ప్రకటించిన తర్వాత ప్రధాని మోడీ బెంగాల్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. గత ఐదు నెలల్లో ఇది మూడో పర్యటన.

## దమ్ముంటే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు

### సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్..!




**హైదరాబాద్,తెలంగాణ దిశ :**
పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఆధారాలతో సహా దొరికారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి కి దమ్ముంటే వారితో రాజీనామా చేయించాలని సవాల్ చేశారు. ఉప ఎన్నికల్లో ఎవరి దమ్ము ఎంతో తెలుస్తుందని అన్నారు. గతంలో ఏడు ఉప ఎన్నికలు వస్తే అన్నింట్లోనూ ఓడిపోయారని విమర్శించారు. జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనంతో సమస్యలు తప్పవని అన్నారు. మూడు కార్పొరేషన్లు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని ఆరోపించారు. అంతకుముందు యూరియా సమస్యపైనా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేస్తూ వస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు.
ముఖ్యం గాకాంగ్రెస్ పార్టీ పల్లె ప్రాంతాలపై పగబట్టినట్లు వ్యవహరిస్తోందని, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా పథకాల అమలును అడ్డుకుంటోందని ఆయన మండిపడ్డారు. రైతులకు అందాల్సిన రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి కీలక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనబెట్టిందని కేటీఆర్ విమర్శించారు. సాగుకు అవసరమైన కరెంట్ సరఫరాను కూడా అస్తవ్యస్తం చేసి, అన్ని అంశాల్లో ప్రజలను పట్టిపీడిస్తోందని ధ్వజమెత్తారు. రైతాంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి లేమివల్లనే నేడు పల్లెల్లో అసంతృప్తి నెలకొందని ఆయన పేర్కొన్నారు. రైతులకు యూరియా సరఫరా చేసే విషయంలో ప్రభుత్వం కొత్తగా తీసుకు వస్తున్న మొబైల్ అప్లికేషన్ విధానాన్ని కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. రైతుల అవసరాలకు తగ్గట్లుగా యూరియా సంచులను సరఫరా చేయలేక, ఇప్పుడు మొబైల్ యాప్ ద్వారా ఇస్తామని రైతులను మభ్యపెడుతున్నారని ఆయన విమర్శించారు.

## మనుస్మృతి అమలు చేయాలన్నదే బీజేపీ పన్నాగం

### - టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**
ప్రధాని మోడీ, హెూంమంత్రి అమిత్ షాకి గాంధీ పేరు పలికితే ఉలుకు అని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఇవాళ రోడ్‌లోఏఐసీసీ పిలుపు మేరకు ఆధ్వర్యంలో పాల్గొన్న టీపీసీసీ చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రసంగించారు. గాంధీ కుటుంబం పేరు పలికితే బీజేపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడతాయని విమర్శలు గుప్పించారు. గాడ్సే పూజించే వారు కాబట్టే గాంధీ పేరు తొలగిస్తున్నారని అన్నారు. గాంధీ కుటుంబాన్ని ధైర్యంగా ఎదుర్కొనే ధైర్యం మోడీ, అమిత్ షాకి లేదని అన్నారు. గాంధీ పేరు పలికితే ప్రజల హృదయాల్లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కనపడతారన్నారు. దేశ ప్రజల గుండెల్లో గాంధీ పేరు చిరస్మరణీయ మని అన్నారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో మాట్లాడి జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చారన్నారు. ప్రజలకి 100 రోజుల ఉపాధి కోసం జాతీయ ఉపాధి హామీ పథకం తెచ్చారని, 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు కోత పెడుతూ వస్తోందని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగింపు అప్రజాస్వామికం అని అన్నారు. మహాత్మా గాంధీ పేరు ప్రజల హృదయాల్లో నుంచి చెరపలేరన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు బీజేపీ తెరలేపిందని ఆరోపించారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూ గాంధీ పేరు తొలగించడం విచారకరం అని అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన వెడమ బొజ్జ ఎమ్మెల్యే అయ్యారన్నారు. సోనియా గాంధీ కుటుంబంపై కక్ష పూరితంగా కేసులు పెట్టారని, గాంధీ, నెహ్రూ లెగసిని మరిపించే ప్రయత్నం చేస్తున్నారని, లౌకిక వాద దేశంలో మోదీ,అమిత్ షా పప్పులు ఉడకవన్నారు.

## శక్తిమంతమైన దేశం తన ఇష్టాలను ఇతరుపై రుద్దడం కరెక్ట్ కాదు : ఎస్ జైశంకర్

**న్యూఢిల్లీ,డిసెంబర్,20:**ఒక దేశం శక్తిమంతమైన దేశమైనంత మాత్రాన అది తన ఇష్టాలను ఇతరులపై రుద్దడం సరికాదని భారత విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ స్పష్టంచేశారు. ప్రపంచీకరణ మన ఆలోచన, పని విధానాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. శనివారం మహారాష్ట్ర పుణెలోని సింబయోసిస్ ఇంటర్నేషనల్‌లో జరిగిన స్నాతకోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, అనేక అధికార కేంద్రాలు ఉద్భవించాయని మంత్రి జైశంకర్ చెప్పారు.
అధికారం అనేదానికి ఎన్నో అర్థాలు ఉంటాయని.. వాణిజ్యం, మిలిటరీ, ఇంధనం, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా అవి మారుతుంటాయని పేర్కొన్నారు. ఈ అధికారం ఏ ఒక్క దేశానికి పరిమితం కాదని, ఈ విషయాన్ని గ్లోబల్ పవర్స్ గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎంత శక్తిమంతమైన దేశమైనా సరే అది తన ఇష్టాలను ఇతరులపై రుద్దలేదని, ప్రపంచ దేశాల మధ్య సహజమైన పోటీ ఉందని మంత్రి పేర్కొన్నారు.



# హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ జోన్ల నిర్ణయం వల్ల పేద రైతులకు నష్టం

**- మాస్టర్ ప్లాన్ ను రైతులకు అనుగుణంగా రూపొందించాలి**

**- హెచ్ఎండిఏ పరిధిలో రైతుల సమస్యలపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో చర్చా వేదిక**



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ)** :హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ జోన్ల నిర్ణయం వల్ల పేద రైతులకు నష్టం కలుగుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. హెచ్ఎండిఏ పరిధిలో రైతుల సమస్యలపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో చర్చా వేదిక నిర్వహించారు. గత 11 సంవత్సరాలుగా జోన్లు మార్పులకు నోచుకోలేదన్నారు. రైతులకు అనుకూలంగా జోన్ల మార్చాలని కోరారు. హైదరాబాద్ తో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం 7257 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో 2013 లో మాస్టర్ ప్లాన్ రూపొందించారని తెలిపారు. ప్రస్తుతం హెచ్ఎండిఏ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాలలోని 70 మండలాలు, 24 మునిసిపాలిటీలు, 8 మునిసిపల్ కార్పొరేషన్లు, సుమారు 750 గ్రామాలు ఉన్నాయన్నారు. అయితే ఇటీవల 20 మునిసిపాలిటీలు, 7 మునిసిపల్ కార్పొరేషన్లను జిహెచ్ఎంసిలో విలీనం చేశారని అన్నారు. మాస్టర్ ప్లాన్ వల్ల ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి ఏమోగానీ రైతుల పాలిట మాత్రం శాపంగా మారిందన్నారు. మాస్టర్ ప్లాన్ లో భూములను కన్సర్వేషన్ (వ్యవసాయం) పబ్లిక్–సెమి పబ్లిక్, రిక్రియేషన్, ఓపెన్ స్పేస్, ట్రాఫిక్, రవాణా, పెరి–అర్బన్, రెసిడెన్సియల్ (నివాస), కమర్షియల్ (వాణిజ్య), ఇండస్ట్రియల్ (పారిశ్రామిక), మల్టిపుల్ (బహుళ ప్రయోజన) తదితర జోన్లుగా విభజించడం జరిగిందన్నారు. పేద, అమాయక, సన్న, చిన్నకారు రైతుల భూములు ఇండ్ల నిర్మాణానికి కూడా అవకాశం లేని కన్సర్వేషన్ లాంటి జోన్లలో ఉన్నాయన్నారు. ఈ కారణంగా దాదాపు 50 వేల మంది రైతులు తమ భూములలో సొంత ఇల్లు కూడా నిర్మించుకునే పరిస్థితి లేదన్నారు. మరో వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా బాబులు, పలుకుబడి గల వారి భూములు ఎన్ని అంతస్తులైనా ఇల్లు నిర్మించుకునే అవకాశం ఉండే రెసిడెన్సియల్, ముల్టీపుల్ జోన్లలో ఉన్నాయన్నారు. పేదలు, ధనవంతుల మధ్య ఉండే అంతరం ఇక్కడే తెలుస్తుందన్నారు. వీరు వందల కోట్లకు పడగలెత్తుతుండగా పేదలు పేదవారుగానే మిగిలిపోతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరా, రెండెకరాల భూమి ఉన్న రైతులు కూడా సొంత ఇండ్లకు దూరమవుతున్నారని, భూమి ఉన్నా కుటుంబం గడవని దయనీయ పరిస్థితి ఉందన్నారు. అంతే కాకుండా ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న భూములకు కూడా సర్వీస్ రోడ్డు నుండి రోడ్డు ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. రింగ్ రోడ్డు నుండి ఒక కిలో మీటర్ పరిధిలో ఎలాంటి భూసేకరణ చేయకుండా 100 అడుగుల వెడల్పు తో గ్రిడ్ రోడ్లను ప్రతి పాదించడంతో రైతులు ముఖ్యంగా చిన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న గ్రామాలన్నింటిని మునిసిపాలిటీలుగా మార్చి జిహెచ్ఎంసిలో విలీనం చేయడం జరిగిందన్నారు. ఈ పరిస్థితిలో రింగ్ రోడ్ లోపల ఉన్న భూములను కన్సర్వేషన్, ఓపెన్, రిక్రియేషన్ తదితర జోన్ల లో ఉంచడంలో అర్థమే లేదన్నారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న మాస్టర్ ప్లాన్ ను తక్షణమే మార్చి రైతులకు అనుకూలమైన రీతిలో రూపొందించవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎస్. మల్లారెడ్డి భౌరంపేట్మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**కుత్బుల్లాపూర్,డిసెంబర్ 21, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 295 డివిజన్ బౌరంపేట్ నివాసితులు వెంకట్రామ్ శివ ప్రసాద్ రెడ్డి గారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారి కుటుంబ సభ్యులకు టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి శనివారం అంద జేశారు. ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం, ప్రజా సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల్లో సీఎంఆర్ఎఫ్ సహాయం రూ. 3.76 లక్షల కుటుంబాలకి 1,685 కోట్లు రూపాయలను బాధ్యత కుటుంబాలకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దిల యాదిరెడ్డి, సీతారామరెడ్డి, భరత్ గౌడ్ పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలపై కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో శిక్షణ విజయవంతం





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ)** :పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలపై కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో 29వ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో విజయవంతంగా నిర్వహించారు. పరిశ్రమల్లో భద్రతా విధానాల బలోపేతం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, ల్యాబొరేటరీ భద్రతా ప్రమాణాలు, ఇండస్ట్రియల్ గ్యాస్ టెస్టింగ్, ఫైర్ సేఫ్టీ, అలాగే ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లపై ఈ కార్యక్రమంలో నిపుణులు విస్తృతంగా అవగాహన కల్పించారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను వ్యవస్థ బద్ధంగా ముందస్తుగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్ అశోక్ పొడిశెట్టి పాల్గొని, భద్రతను కేవలం నిబంధనల పరిమితికి కాకుండా సంస్థ నిర్మాణంలో భాగంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, సంస్థ ఆస్తుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణకు మేనేజ్‌మెంట్ నాయకత్వం, ఉద్యోగుల చురుకైన భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ జనరల్ సెక్రటరీ ఎ. సూర్య ప్రకాశ్తో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హరి బుక్క, జి. జగదీశ్వరరావు, ఈ. తిరుపతి హాజరై పరిశ్రమలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన ఈహెచ్ఎస్ సమస్యలపై చర్చల్లో పాల్గొన్నారు. వారి పాల్గొనడం సాంకేతిక చర్చలకు, పరస్పర అభిప్రాయాల మార్పిడికి మరింత విలువను చేకూర్చిందన్నారు. అదే విధంగా రీసస్టైనబిలిటీ లిమిటెడ్ సంస్థకు చెందిన వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ ఆపరేషన్స్) ఆర్ కెవి. నటరాజ్, బేసిక్ ఎలిమెంట్స్ సంస్థ డైరెక్టర్ శ్రీ ప్రసాద్ నిస్టాలాతో పాటు వారి సంస్థల అంశ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని, పరిశ్రమల అనుభవాల ఆధారంగా ప్రాయోగిక అంశాలను వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 80కి పైగా కంపెనీలకు చెందిన ఈహెచ్ఎస్, పర్యావరణ నిపుణులు, ల్యాబొరేటరీ సిబ్బంది, సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, అలాగే ఎస్ సిఎం, హెచ్ ఆర్ విభాగాల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలు, పర్యావరణం, సంస్థల ఆస్తుల రక్షణలో సమూహ బాధ్యత అత్యంత కీలకమని బలమైన సందేశంతో కార్యక్రమం ముగిసింది. పరిశ్రమల్లో ఈహెచ్ఎస్ ఉత్తమతను ప్రోత్సహించే విశ్వసనీయమైన, నమ్మదగిన, ప్రభావవంతమైన వేదికగా కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ తన పాత్రను మరింత బలపరిచిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ అధ్యక్షులు తపస్ సహా మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా సిఈపి ప్రయాణం విజయవంతంగా కొనసాగడానికి సహకరించిన పరిశ్రమలు, ఫ్యాకల్టీలు, అంశ నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సహకారం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిఈపి లక్ష్యాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరి సహకారం అవసరమని అన్నారు.

# బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. మూడు లక్షల ఎల్ఓసి అందజేత

**- నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేత**



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఎస్ ఆర్ నాయక్ నగర్ కాలనీ వాసులు కె. రమణమ్మ చికిత్స కోసం వారి కుటుంబ సభ్యులకు శనివారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 3 లక్షల ఎల్ఓసిని అందజేశారు. గత కొన్ని రోజులుగా రమణమ్మ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేక కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం ఎల్ఓసి మంజూరు చేయించారు ఈ కాపీని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి కుటుంబ సబ్యులకు హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైసి గారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, అచ్చమ్మా, విజయ్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : పట్నం మహేందర్ రెడ్డి







**ఘట్కేసర్, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ)** :ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలిలో పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లాలో శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పర్యటించి ఘట్ కేసర్ లోని బంధన్ ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే చామకూరు మల్లారెడ్డితో కలిసి 350 మంది లబ్ధిదారులకు రూ. 4 కోట్ల 6 లక్షల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఘట్కేసర్ మండలంలో 46 మందికి, మేడిపల్లిలో 110 మందికి, కీసరలో 60 మందికి, కాప్రా లో 16 మందికి, మూడు చింతలపల్లి మండలంలో 32 మందికి, మేడ్చల్ మండలంలో 86 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మహేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సుల ప్రయాణాలను కల్పించడంతోపాటు అర్హులైన ప్రతి నిరుపేదలకు రేషన్ కార్డులను, సన్న బియ్యంను కొత్తగా పంపిణీ చేసిందని చెప్పారు. ఇళ్ళు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లా మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తున్నామని అన్నారు. క్రిస్టమస్ సందర్భంగా 50 చర్చిలకు 30 వేల చొప్పున రూ. 15 లక్షల నిధులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, ఆర్టీఏ సభ్యులు జైపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు ముజీబ్, ఘట్కేసర్ మండల తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బస్తీ బాటతో మల్లాపూర్ లోని మంచి నీటి సమస్య పరిష్కారానికి కృషి

**- కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్**





మల్లాపూర్, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ) :“బస్తీ బాట” కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ లో మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం జలమండలి ఏఈ సిరాజ్ తో కలిసి డివిజన్ పరిధిలోని కెఎల్‌రెడ్డి నగర్ కాలనీ, భవాని నగర్ కాలనీ, హెచ్ సిఎల్ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని జలమండలి ఏఈ కి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బస్తి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోయలకొండ రాజేష్, సంయుక్త కార్యదర్శి వుండం శ్రీనివాస్, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,లైన్ మెన్లు తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాప్రా డివిజన్ నుంచి పోటీ చేస్తా..

**- కాంగ్రెస్ పార్టీ జిహెచ్ఎంసి గ్రేటర్ కన్వీనర్ తోటకూర శ్రీకాంత్**

**కాప్రా, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ)** :గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ఎన్నికల్లో కాప్రా డివిజన్ నుంచి పోటీ చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిహెచ్ఎంసి గ్రేటర్ కన్వీనర్ తోటకూర శ్రీకాంత్ స్పష్టం చేశారు. గత ఐదేళ్లుగా కాప్రా డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజల సేవ చేస్తున్నారని తెలిపారు. ఈ కాలంలో డివిజన్ అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశానన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తూ, పార్టీ విజయం కోసం అన్ని విధాలుగా కష్ట పడతానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం, కాప్రా డివిజన్ ప్రజల అభివృద్ధి కోసం నా శక్తి మేరకు పనిచేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించి మేయర్ స్థానాన్ని



కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# సీసీ రోడ్డు పనుల పరిశీలన



**కుషాయిగూడ, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సూచన మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు కుషాయిగూడలో జరుగుతున్న రోడ్డు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, చల్ల వెంకటేష్ జనార్ధన్, వీరేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మాతృశక్తి...

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం ఎవరెస్టును రెండుసార్లు అధిరోహించిన భారత మహిళ సంతోష్ యాదవ్‌ను తమ వ్యవస్థాపక దినోత్సవానికి ఆహ్వానించి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఒక కొత్త చర్చకు తెరతీసింది. అసలు మహిళలపై ఆరెస్సెస్ వైఖరి మారుతోందా? అనే ప్రశ్న కూడా ఉత్పన్నం అవుతోంది. సంఘ్ పరివార్ నిబంధనల ప్రకారం, కేవలం "హిందూ పురుషులు"లు మాత్రమే ఆరెస్సెస్‌లో సభ్యులు కాగలరు. మహిళలకు ఇక్కడ ప్రత్యేక విభాగం ఉంది. దసరా రోజు ప్రసంగానికి ముందుగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ దుర్గాదేవి పూజ చేశారు. ఆరెస్సెస్‌లో ఉదయం నిర్వహించే "శాఖ" మినహా.. మిగతా పనులన్నింటిలోనూ పురుషుల్లానే మహిళలు కూడా పాలుపంచుకుంటారని ఆ ఆరోజు ఆయన చెప్పారు. ఇప్పుడు తాజాగా సంతోష్ యాదవ్‌తో ఆయన వేదిక పంచుకొని మహిళలపై తమ వైఖరి మారుతోందని చెప్పే చర్చను మరో అడుగు ముందుకు తీసుకెళ్లారు. అంతేకాదు.. అంతటా శాంతి, పవిత్రతలు నెలకొనేలా చూడటంలో స్త్రీ శక్తికి ప్రాధాన్యం ఇవ్వడం అనివార్యం"అని కూడా ఆయన అన్నారు. మహిళల గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ "రాష్ట్ర సేవిక సమితి" పేరును ఆరెస్సెస్ ముందుకు తీసుకొస్తుంది. సంఘ్‌లో ఇది మహిళల విభాగం. అయితే, దీని పేరు పెద్దగా వినిపించదు. నిజానికి సేవిక సమితిని కూడా ఆరెస్సెస్ అనే పిలుస్తారు. దీన్ని కూడా ప్రధాన ఆరెస్సెస్‌లానే విజయ దశమి రోజు కేశవ్ బలిరామ్ హేగ్డేవార్ మొదలుపెట్టారు. సంఘ్‌లో పురుషాధిపత్యంపై చాలా చర్చ జరుగుతుంటోంది. ఈ వైఖరిని మార్చే ప్రయత్నాల్లో భాగంగానే ప్రస్తుతం సంతోష్ యాదవ్‌ను ఆహ్వానించినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇదివరకు కూడా కాంగ్రెస్ నాయకురాలు రాజ్‌కుమారి అమృత్ కౌర్, మాజీ ఎంపీ అనుసూయ బాయి కాలే ఇలా మరికొంత మంది ప్రముఖులను కూడా ఇదివరకు ఆరెస్సెస్ ఇలా ఆహ్వానించింది. భారత సంప్రదాయంలో స్త్రీ, పురుషులను ఒకరికొకరు తోడు–నీడగా మోహన్ భాగవత్ చెబుతుంటారు. "విదేశీ దండయాత్రల వల్ల ఈ సంప్రదాయం పూర్తిగా దెబ్బతింది. అయితే, పూజించడం లేదంటే రెండో తరగతి పౌరులుగా వంటగదికే పరిమితం చేయడం లాంటివి ఎక్కువయ్యాయి. నేడు మళ్లీ మాతృశక్తికి సాధికారత కల్పించాలి. ఉద్యోగం, కుటుంబం, ప్రజాజీవనం ఇలా అన్నింటిలోనూ వారికి సగ భాగం ఇవ్వాలి"అని ఆయన చెప్పారు. ఇటీవల సమాజంలోని భిన్న వర్గాలకు చెందిన ప్రతినిధులతో ఆరెస్సెస్ చర్చలు మొదలుపెట్టింది. సామాజిక సమస్యలు, కుల వివక్ష లాంటి అంశాలపై ఇమామ్ షాహిబ్‌తో మాట్లాడేందుకు మోహన్ భాగవత్ ముస్లింల ప్రార్థనా స్థలానికి కూడా వెళ్లారు. దీంతో ఆరెస్సెస్ వైఖరిలో మార్పు వస్తోందనే చర్చ ఎక్కువైంది. సమాజంలో తమపై పడిన ముద్రను చెరిపేసుకోవడానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకు నేడు సంఘ్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని రాజకీయ విమర్శకులు అంటున్నారు. అయితే, మహిళల విషయంలో గత మూడు దశాబ్దాలుగా ఆరెస్సెస్ వైఖరి మారుతూ వస్తోందని సంఘ్ మద్దతుదారులు అంటున్నారు. మీరు ప్రసంగంలో భాగవత్ వాడిన పదాలను జాగ్రత్తగా గమనించండి. దానిలో పురుషాధిక్య పదజాలం చాలా కనిపిస్తుంది. అసలు సంప్రదాయ కుటుంబ వ్యవస్థకు వెలుపల మహిళలు జీవించలేరనే ధోరణిలో ఆయన మాట్లాడారు. మహిళలకు వారి శరీరాలపై వారికి హక్కులు ఇచ్చేందుకు సంఘ్ సిద్ధంగా లేదు"అని దిల్లీ జవహర్‌లాల్ యూనివర్సిటీలోని సోషియాలజీ ప్రొఫెసర్ హరీశ్ వాంఖడే అన్నారు. మోహన్ భాగవత్ తన ప్రసంగంలో మహిళల గురించి మాట్లాడేటప్పుడు పదేపదే "మాతృ–శక్తి" అనే పదాన్ని ఉపయోగిస్తూ కనిపించారు. ముఖ్యంగా మహిళల జీవితంలో "మాతృత్వం" అనే అంశానికి ఆరెస్సెస్ ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తుంటుంది. నాగ్‌పూర్‌కు చెందిన మరాఠీ రచయిత అరుణ సబానే ఈ విషయంపై మాట్లాడుతూ.. "తల్లి అనే పదం వారికి ఒక లక్ష్మణ రేఖ లాంటిది. మహిళలు ఈ గీత దాటి ముందుకు రాకూడదని వారు భావిస్తారు"అని ఆమె అన్నారు. 1987నుంచీ సంఘ్‌లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం క్రమంగా పెరుగుతూ వస్తోందని ఏళ్ల నుంచీ ఆరెస్సెస్‌లో పనిచేస్తున్న దిలీప్ దేవధర్ అన్నారు. "ఇక్కడ సంఘ్‌లో ఒక కుటుంబ సభ్యుడు చేరితే, ఆ కుటుంబం మొత్తం దానిలో చేరినట్లే. ఇక్కడ పురుషులతోపాటు మహిళలు కూడా సంఘ్‌లో చేరినట్లుగానే భావించాలి"అని ఆయన వివరించారు. అయితే, సంఘ్‌లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందనే విషయాన్ని దిలీప్ అంగీకరించారు. "సమాజంలో మహిళల సంఖ్యతో పోలిస్తే, వారికి సముచిత స్థానం లభించడంలేదు"అని ఆయన అన్నారు. ఎనిమిదేళ్ల విరామం తర్వాత, నేను మళ్లీ సంఘ్ విజయదశమి కార్యక్రమానికి మళ్లీ హాజరయ్యాను. ఇక్కడ ముఖ్య అతిథుల్లో చాలా మంది కనిపించారు. అయితే, "పాథ్ సంచాలన్" సహా కొన్ని కార్యక్రమాల్లో మహిళలు కనిపించలేదు. ఈ విషయంపై అక్కడ వాలంటీర్లతో మాట్లాడినప్పుడు.. "కొన్ని కార్యక్రమాల్లో మహిళలు పాల్గొనని మాట వాస్తవమే. దీని బట్టి సంఘ్‌లో మహిళలే లేరని అనుకోకూడదు. ఆరెస్సెస్‌లో చాలా మంది మహిళలు సేవలు అందిస్తున్నారు. సంఘ్‌లో వారి పాత్ర క్రమంగా పెరుగుతోంది"అని అక్కడున్న వారు చెప్పారు. మరో వాలంటీర్ మాతో మాట్లాడుతూ.. "సంఘ్‌లో మొత్తంగా 36 సంస్థలు ఉన్నాయి. వీటిలో రాష్ట్ర సేవిక సమితి కూడా ఒకటి. ఇక్కడ అన్ని సంస్థలూ కలిసి పనిచేస్తాయి. అంతేకానీ, మహిళల విషయంలో ఎలాంటి వివక్షా ఉండకూడదు"అని అన్నారు. సేవిక సమితిని ఆరెస్సెస్‌తో సమానమని సంఘ్ పరివార్ చెబుతుంటుంది. దేశ పునర్నిర్మాణంలో సంఘ్‌లోనే ఇది కూడా పనిచేస్తోందని వివరిస్తోంది. ఆరెస్సెస్ విద్యార్థి విభాగం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రధాన కార్యదర్శి నిధి త్రిపాఠి కూడా ఈ విషయంపై మాట్లాడారు. "మాతృత్వాన్ని ప్రతికూల కోణంలో ఎప్పుడూ చూడకూడదు. మహిళలకు భిన్న రకాల శక్తి సామర్థ్యాలు ఉంటాయి. లక్ష్మీబాయిని తీసుకోండి. ఆమె రాణి, యోధురాలు, మంచి తల్లి. ఎన్నో బాధ్యతలను ఆమె విజయవంతంగా నిర్వర్తించారు"అని ఆమె అన్నారు. అయితే, మహిళల శక్తి సామర్థ్యాల విషయంలో కుటుంబ బంధాలకు అతీతంగా ఆరెస్సెస్ ఆలోచించాలని హరీశ్ వాంఖడే అన్నారు. అత్యాచారాలు, మతపరమైన పెళ్లిళ్లు లాంటి సంస్థ తమ వైఖరిని కూడా స్పష్టం చేయాల్సి ఉందని ఆయన వివరించారు. "అసలు మహిళలు ఎవరిని పెళ్లి చేసుకోవాలో వారు ఎలా నిర్ణయిస్తారు? ఆమె ఏ మతానికి చెందిన వ్యక్తిని ఎంచుకుంటే ఏముంది?"అని వాంఖడే అన్నారు. హిందూ యువతులు వేరే మతాలకు చెందిన అబ్బాయిలను పెళ్లి చేసుకోవడంపై బీజేపీ, పార్టీకి చెందిన అగ్రనాయకులు తమ వ్యాఖ్యలతో తరచూ వివాదాలు సృష్టించే సంగతి తెలిసిందే. సంఘ్‌లోకి సంప్రదాయవాదులు, ఆధునిక విధానాలను అనుసరించే వారి మధ్య ఒకరకమైన ఘర్షణ కనిపిస్తోందని సోషియాలజిస్టు బద్రి నారాయణ్ వివరించారు. "ప్రస్తుతం కొన్ని అంశాల్లో మార్పు కనిపిస్తోంది. కానీ, సంస్కరణలు కనిపించేందుకు సమయం పడుతుంది"అని ఆయన అన్నారు. అయితే, ఇది కేవలం బీజేపీకి పరిస్థితిని అనుకూలంగా మార్చడానికి చేసే ప్రయత్నంగానే చూడాలని వాంఖడే అంటున్నారు. కానీ, మహిళలకు సమానత్వం కల్పించే విషయంలో ఆరెస్సెస్ అధిపతి చాలా సీరియస్‌గా ఉన్నారని సంఘ్ వాలంటీర్లు చెబుతున్నారు. దిలీప్ దేవధర్ కూడా మహిళా రిజర్వేషన్లకు సంఘ్ కట్టుబడి ఉందని అన్నారు.

# ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా జిహెచ్ఎంసిలో శివారు మున్సిపాలిటీల విలీనం

### - కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ) :** ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నగర శివార్ లో ఉన్న మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జిహెచ్ఎంసిలో కలిపిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ఆరోపించారు. శనివారం ఆయన నిజాంపేట సర్కిల్ పరిధిలోని బండారి లేఅవుట్ ఫంక్షన్ హాల్ లో సర్కిల్ బిఆర్ఎస్ క్రియాశీల కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి భిన్నంగా వ్యవహరిస్తూ దుష్ట పాలన కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో చర్చించారు. శివారులను జిహెచ్ఎంసిలో కలపడానికి కేవలం ఆదాయం పెంచుకోవడానికి మాత్రమే తప్ప దేనికి పనికిరాదని, ఇది అనాలోచితమైన చర్య అని ఆయన విమర్శించారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా, అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్న ప్రజాకంటక కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగెత్తి ఉన్నారని అన్నారు. ఈ విషయం గ్రామ పంచాయతీ ఎన్నికలలో బట్టబయలు అయిందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలలో సుమారు 4000 గ్రామ సర్పంచులను బిఆర్ఎస్ గెలిపించుకుందని ఆయన ప్రకటించారు. పార్టీ ఫిరాయింపులపై ఎవరైనా ప్రశ్నిస్తే రాజ్యాంగం గురించి రాహుల్ తో మాట్లాడుకోమని ముఖ్య మంత్రి చెబుతుండడం దారుణం అన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని అన్ని డివిజన్లను బిఆర్ఎస్ పార్టీ గెలుచుకునేటట్లుగా ప్రతి పార్టీ కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. బిఆర్ఎస్ గతంలో చేసిన అభివృద్ధి పనులను ఓటర్లకు తెలియపరచి పార్టీకి ఓట్లు పడే విధంగా ప్రతి కార్పొరేటర్ విజయం సాధించేటట్లు పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు జ్యోతి నర్సింహారెడ్డి,

బుర్ర దేవి చందు ముదిరాజ్, పెద్దిరెడ్డి సుజాత, కసాని సుధాకర్, కాసాని శిరీషవీరేష్, రాఘవేందర్ రావు, బాలాజీ నాయక్, మాజీ ఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, బిఆర్ఎస్ పార్టీ పలు డివిజన్ల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నేతలు, కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు.

# పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, బాలికల సంరక్షణపై అవగాహన

### - సైబర్ నేరాలు, చైల్డ్ హరాస్మెంట్‌పై విద్యార్థులకు సూచనలు
### - డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా మెలగాలని పిలుపు
### - మెహిదీ పట్నంలోని షైనీ స్కాలర్స్ స్కూల్ లో విద్యార్థులకు అవగాహన







**మెహిదీపట్నం, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ) :** మెహిదీపట్నంలోని షైనీ స్కాలర్స్ స్కూల్ విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్, చైల్డ్ హరాస్మెంట్, డ్రగ్స్, రోడ్ సేఫ్టీ, ఆన్‌లైన్ గేమింగ్, సోషల్ మీడియాలో జరిగే మోసాలు, వాట్సప్ చాటింగ్ ద్వారా ఎదురయ్యే ప్రమాదాలు తదితర అంశాలపై పోలీస్ అధికారులు విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కృష్ణగౌడ్, ఆసిఫ్ నగర్ ఇన్ స్పెక్టర్ ఎన్. ఆనంద్ గౌడ్, ఆసిఫ్ నగర్ సబ్ ఇన్ స్పెక్టర్లు ఇ. తులసి తదితరులు హాజరై ప్రసంగించారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రాయోగిక ఉదాహరణలతో వివరించారు. ఆన్‌లైన్ భద్రత, స్వీయ అవగాహన, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే ఎలా నివేదించాలో, రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో సూచనలు చేశారు. డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా మెలగాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండటం అవసరమని తెలిపారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా సైబర్ నేరాలను ఎలాగుర్తించాలి, ఎలా నివారించాలనే అంశాలపై మార్గనిర్దేశం చేశారు. సురక్షితమైన సమాజ నిర్మాణానికి పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పాఠశాల డెరక్టర్ ముష్తాఖ్ అహ్మద్ పేర్కొన్నారు. విద్యార్థులకు విలువైన అవగాహన అందించినందుకు ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సురక్షితమైన, సహాయక వాతావరణాన్ని పెంపొందించడంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ షాహియా సుల్తాన, ఉపాధ్యాయులు శ్రీ గౌరీ శ్రీ, అస్మ పర్వీన్, అనిత, సరస్వతి శర్మ సుధాకర్, విజయమోహన్, మహేష్, రవీందర్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరం

### - మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ) :** విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని అందుకు కావలసిన పరికరాలు, గ్రౌండ్ వంటి సౌకర్యాలను అందిస్తానని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి విద్యార్థులకు తెలిపారు. శనివారం శామీర్ పేట్ మండలం హకీంపేటలో గల తెలంగాణ ప్రభుత్వ క్రీడల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ. స్కూల్లో ఎంతమంది విద్యార్థులున్నారని, ఏఏ స్పోర్ట్స్ ఉన్నాయని, కోచ్ లు బాగా ప్రాక్టీస్ చేయిస్తున్నారా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ విద్య తో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, వారికి ఆసక్తి ఉన్న క్రీడల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న స్పోర్ట్స్ కాకుండా అదనంగా ఏమేమి స్పోర్ట్స్ కావాలని విద్యార్థులను అడుగగా, బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, స్కేటింగ్, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, సైక్లింగ్, హాకీ వంటి క్రీడలకు అవసరమైన గ్రౌండ్, స్పోర్ట్స్ పరికరాలను విద్యార్థులు కావాలని కోరగా కలెక్టర్ పరిశీలించి అందజేస్తామని తెలిపారు. అంతర్జాతీయ క్రీడల పోటీల వరకు వెళుతున్న విద్యార్థుల పై ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థి పై 4 నుండి 5 లక్షల వరకు ఖర్చు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. కోచ్ లు ఎంత శిక్షణ ఇచ్చినప్పటికి మీకు చిత్తశుద్ధి, అంకితభావం స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరమ న్నారు. రోజురోజుకు మన ఆలోచనలు, అభిప్రాయాలు మారుతుంటాయని వాటిని ఎప్పటికప్పుడు అప్ డేట్ చేస్తూ ముందుకు వెళ్లాలని వివరిస్తూ, మీరు శ్రద్ధగా బాగా చదువుకోవాలని, భవిష్యత్తులో మీకు ఉద్యోగ పరంగా గాని, వ్యాపార పరంగా గాని అవసరమైన సహాయాన్ని తప్పకుండా అందిస్తానని కలెక్టరు



విద్యార్థులకు హామీ ఇచ్చారు. సివిల్స్ చేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఎప్పుడైన సరే అందుబాటులో ఉంటూ మీకు కావలసిన అవసరమైన మార్గ నిర్దేశాన్ని సలహా, సూచనలను అందిస్తానని కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి విద్యార్థులకు తెలియజేసారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు విద్యార్థులకు కలెక్టర్ తెలిపారు. అనంతరం జిమ్నాస్టిక్ హాల్, గ్రౌండ్స్ ను కలెక్టర్ సందర్శించారు.

# లేహ్ లో ఏం జరుగుతోంది?

లేహ్‌లో జరిగిన హింసాత్మక నిరసనల నేపథ్యంలో విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆయన స్వగ్రామం ఉలే టోక్పోలో అరెస్టు చేశారు. ఇంజినీర్, ఇన్నోవేటర్, విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త అయిన సోనమ్ గత ఏడాది కాలంగా వివిధ సందర్భాల్లో ఆమరణ నిరాహార దీక్ష చేశారు. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ దిల్లీకి పాదయాత్ర కూడా చేశారు. కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్ రాజధాని లేహ్‌లో యువత చేపట్టిన నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. ఈ ఘటనలో నలుగురు చనిపోగా, 50 మందికి పైగా గాయపడ్డారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలని, ఆరో షెడ్యూల్ కింద రక్షణ కల్పించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్నాయి. కార్గిల్‌లో ముస్లింలు, లేహ్‌లో బౌద్ధులు ఎక్కువగా ఉంటారు. రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ గిరిజనుల హక్కులు, వారి గుర్తింపు, ప్రయోజనాలను రక్షిస్తుంది. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ లేహ్ అపెక్స్ బాడీ సెప్టెంబర్ 10న నిరాహార దీక్ష ప్రారంభించింది. ఈదీక్షలో ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా పాల్గొన్నారు. జరిగిన హింస తర్వాత నిరాహార దీక్షను తాత్కాలికంగా నిలిపేశామని, ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని సోనమ్ వాంగ్‌చుక్ చెప్పారు."ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. వారికి ఓర్పు నశించింది. ఇంతమంది ఇన్ని రోజులుగా నిరాహార దీక్ష చేస్తుంటే, ప్రభుత్వం మాత్రం అక్టోబర్ 6న మాట్లాడదాం అని చెప్పడం వారికి కోపం తెప్పించింది. కానీ, పోలీసులు కాస్త సంయమనం పాటించి ఉండాల్సింది. ప్రాణనష్టం లేకుండా పోలీసులు హెచ్చరించాల్సింది. మొదట్లో పోలీసుల తప్పు లేదు. కానీ, ఆ తర్వాత వారు నిరాయుధులైన ప్రజలపై కాల్పులు జరిపారు" అని సోనమ్ వాంగ్‌చుక్ వివరించారు. హింసకు సోనమ్ వాంగ్‌చుక్ కారణమని పేర్కొంటూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది."సోనమ్ వాంగ్‌చుక్ తన ప్రకటనల ద్వారా ప్రజల్ని రెచ్చగొట్టారు. హింస మొదలవగానే నిరాహార దీక్ష ముగించి అంబులెన్స్‌లో తన గ్రామానికి వెళ్లిపోయారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి సోనమ్ వాంగ్‌చుక్ ఎలాంటి ప్రయత్నం చేయలేదు. లద్దాఖ్ ప్రజల ఆశయాలకు తగినంత రాజ్యాంగ రక్షణ కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ఆ ప్రకటనలో పేర్కొంది. హోం మంత్రిత్వ శాఖ చేసిన ఈ వ్యాఖ్య గురించి సోనమ్ వాంగ్‌చుక్‌ను అడిగినప్పుడు 'ఇదేమంత ఆందోళన చెందాల్సిన విషయం కాదు' అన్నారు."ప్రభుత్వం నా గొంతును అణచివేయాలని చూస్తోంది. జరిగిన దానికి నన్నే బాధ్యుడిని చేస్తోంది. ప్రభుత్వం నన్ను జైల్లో వేయచ్చు. నా స్కూల్‌కు చెందిన భూమిని తిరిగి తీసుకున్నారు. చాలా ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. రాజద్రోహం ఆరోపణ కూడా మోపారు. నన్ను లద్దాఖ్‌కు దూరంగా ఉంచాలనుకుంటున్నారు. అందుకే పీఎస్ఏ విధించడానికి కూడా ప్రయత్నిస్తున్నారు" అని ఆయన బదులిచ్చారు. ఈ హింస తర్వాత సోనమ్ వాంగ్‌చుక్, పాకిస్తాన్ పర్యటన గురించి సోషల్ మీడియాలో చాలా మంది ప్రశ్నిస్తున్నారు. పాకిస్తాన్ పర్యటన గురించి ఆయన మాట్లాడుతూ, "ఐక్యరాజ్యసమితికి సంబంధించిన పర్యావరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు నేను ఈ ఏడాది జనవరిలో పాకిస్తాన్ పర్యటనకు వెళ్లాను. ఆకార్యక్రమంలో పర్యావరణానికి సంబంధించి మోదీసాబ్ చేస్తున్న మంచి కార్యక్రమాలను మెచ్చుకున్నాను కూడా. అది చాలా మంచి కార్యక్రమం. అందులో నేను మాత్రమే కాదు, భారత్ నుంచి మరో ఆరుగురు నిపుణులు కూడా పాల్గొన్నారు. ఇది నేను రహస్యంగా చేసిన పర్యటనేమీ కాదు" అని వివరించారు. లద్దాఖ్ ప్రజల డిమాండ్లను చాలా సున్నితత్వంతో వినాలని భారత సైన్యంలో నార్తర్న్ కమాండ్‌కు కమాండింగ్–ఇన్–చీఫ్‌గా పనిచేసిన లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) దీపేంద్ర హుడా అన్నారు. లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన కొత్తలో అక్కడి ప్రజలు ఈ నిర్ణయంపై సానుకూలంగానే ఉన్నారని, తమకు అనుకూలంకాదనుకోవడం మొదలుపెట్టారని హుడాఅభిప్రాయపడ్డారు." తమ ఉద్యోగాలను బయటివాళ్లు లాక్కుంటున్నారని, తమ సంస్కృతి దెబ్బతింటోందని లద్దాఖ్ ప్రజలు భావించారు. "చైనా, పాకిస్తాన్ దేశాలతో సరిహద్దును పంచుకుంటున్న లద్దాఖ్, భారత్‌కు వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనది. చైనాతో సరిహద్దుల్లో భారత్ కొన్నేళ్లుగా ఉద్రిక్తతలు ఎదుర్కొంటోంది.

# ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ





**మల్లాపూర్, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ డివిజన్ కె ఎల్ రెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్ లో అరుణోదయ కళా సంస్కారిక వేది ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ 16వ అయ్యప్ప పూజా మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అరుణోదయ కళా సంస్కారిక వేది అధ్యక్షులు సి. రాధాకృష్ణన్, కార్యదర్శి సునీష్ జాకోబ్, కోశాధికారి ఎం. బిజూ కుమార్, కెఎల్. రెడ్డి నగర్ అసోసియేషన్ సభ్యులు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్, వివిఎస్. ప్రకాష్ రెడ్డి,మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కప్పర సాయి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దంతూరిరాజు గౌడ్, కోయగూర బాలరాజ్, ఎస్ వి.కిట్టు, వి. శ్రీనివాస్,కె. రాజేష్, రుపేందర్ రెడ్డి, కె. సురేష్, ఎం. జయంత్ గౌడ్, వంగవీటి ప్రిన్సు, వినీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ మ్యాక్స్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ యంత్ర సామాగ్రి చోరీ కేసు పై చర్యలు తీసుకోవాలి





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 21, (తెలంగాణ దిశ)** :జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సూపర్ మ్యాక్స్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ యంత్ర సామాగ్రి చోరీకి గురైందని కార్మికులు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన కంపెనీకి వెళ్లి కార్మికులతో కలసి చోరీ జరిగిన యంత్ర సామగ్రి ఉండే ప్రదేశాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిమెట్ల సిఐతో మాట్లాడి దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కంపెనీ 21/2 ఏళ్ల క్రితం మూత పడిందని కార్మికుల రోడ్డున పడ్డారని ప్రస్తుతం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో(ఎన్ సిఎల్ టి) పరిధిలో ఉందని అన్నారు. బ్లేడ్లు తయారు చేసే యూనిట్ మొత్తం మాయమైందని అన్నారు. ఈ కంపెనీ కార్మికులకు బకాయిలు కూడా చెల్లించలేదని అన్నారు. ఈ క్రమంలో విలువైన యంత్రాలు మాయం చేసిన వారిని వెంటనే పట్టుకుని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి ప్రెసిడెంట్ గుంజ శ్రీనివాస్, కార్మికులు దయాకర్, శ్రీనివాస్, సూర్యనారాయణ, రామచంద్రారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కవిత, ఐఎస్ రావు, లక్ష్మారెడ్డి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి టౌన్‌షిప్‌లో ఘనంగా ప్రీ-క్రిస్మస్ వేడుకలు

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి**





ఏఎస్ రావునగర్, డిసెంబర్ 20, (తెలంగాణ దిశ): ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి టౌన్‌షిప్‌లో శనివారం రాత్రి ప్రీ-క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం సోమశేఖర్ రెడ్డి క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు జన్మదినం శాంతి, ప్రేమలకు నిదర్శనమని అన్నారు. భగవంతుని ఆజ్ఞ లేనిదే ఈసృష్టిలో ఏదీ జరగదన్నారు. దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాండాల యాదగిరి గౌడ్ మాట్లాడుతూ పండుగలు మనుషుల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అందరికీ క్రిస్మమస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సభలో పాస్టర్ వినయ్ మాథ్యూస్ దైవ సందేశాన్ని అందించారు. వేడుకల నిర్వాహకులు విజయ్ కుమార్, షాలోమ్ రాజు, ఆంద్రూస్, పునార్జీ, సుబ్రహ్మణ్యం, అఖిల్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# విద్యార్థుల్లో సమానత్వ జాగృతి..

కరీంనగర్: కరీంనగర్, విద్యార్థుల్లో కృతజ్ఞత, సమానత్వ భావనలు పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనాలతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ప్రతిభా పోటీలో భాగంగా కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి ట్రస్మా ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆరవ తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కరీంనగర్‌లోని కోట రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో జరిగిన వ్యాసరచన వక్తృత్వ విభాగాల్లో గణనీయ సంఖ్యలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. పూర్తయిన పరీక్షల ఫలితాలను నేడు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేశారు. వ్యాసరచన విభాగంలో శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల, కరీంనగర్‌కు చెందిన బి.సాయి శ్రేష్ఠ ప్రథమ స్థానం,సరస్వతి పాఠశాల,వెలిచాలకు చెందినటువంటి నెట్టు సంజన ద్వితీయ స్థానం సాధించారు. ఎ. సినీతిక ప్రథమ స్థానం, జెడ్పీహెచ్ఎస్ ఆసిఫ్‌నగర్ విద్యార్థి డి. లక్ష్మీ శ్లోక ద్వితీయ స్థానం గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన ఈనలుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని జీయర్ స్వామి వారి ఆశ్రమ ంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతులు స్వయంగా చిన్నజీయర్‌స్వామివారి చేతుల మీదుగా ప్రదానం చేయబడనున్నాయి. ఫలితాలను ప్రజ్ఞ వికాస్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు, కోట జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి సంయుక్తంగా విడుదల చేశారు,వికాస్ తరంగిణి అధ్యక్షులు గౌతమ్ రావుగారి అధ్యక్షతన జరిగింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని వారు అభిలషించారు.



# ఏ వడ్డీ మంచిది?

సంపాదన ఎంత పెరిగినా.. అప్పుల తిప్పలు మాత్రం తప్పడం లేదు. ఇంటి కోసమో.. కారు కొనడానికో.. వ్యక్తిగత అవసరాలకో రుణాలు తీసుకోవాల్సి వస్తున్నది. ఇలాంటి సందర్భాల్లో వడ్డీరేట్ల గురించి కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే.. ఈ వడ్డీరేట్లే రుణగ్రహీతలపై ఆర్థిక భారం పెరిగేలా చేస్తాయి. ప్రస్తుతం బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు.. రెండు రకాల వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నాయి. అవి.. ఫిక్స్‌డ్ వడ్డీరేటు, ఫ్లోటింగ్ వడ్డీరేటు. అప్పులు చేయడంలో ఆరితేరినవారికి వీటి గురించి తెలిసినా.. కొత్తవారికి కొంచెం కొత్తగానే అనిపిస్తాయి. పూర్తిగా తెలుసుకుంటేనే.. ఆ తర్వాత ఆర్థికభారం పడకుండా కాపాడతాయి.

ఫిక్స్‌డ్ రేట్లు: ఈ వడ్డీరేట్లు ఎప్పుడూ స్థిరంగానే ఉంటాయి. లోన్ తీసుకున్నప్పటి నుంచి.. టెన్యూర్ ముగిసేవరకు వడ్డీరేటు ఒకేరకంగా ఉంటుంది. ప్రతినెలా చెల్లించాల్సిన ఈఎంఐ కూడా అంతే ఉంటుంది. కాబట్టి, నెలకు ఎంత ఈఎంఐ కట్టాలో ముందే అవగాహన ఉంటుంది. ముఖ్యంగా.. ఎక్కువ రోజులు టెన్యూర్ లోన్ల కోసం ఈ ఫిక్స్‌డ్ వడ్డీరేట్లు బాగుంటాయి.

ఫ్లోటింగ్ రేట్లు: ఇవి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. ఫిక్స్‌డ్ రేట్ల కంటే తక్కువగా ఉండే ఈ ఫ్లోటింగ్ వడ్డీరేట్లు.. దీర్ఘకాలిక రుణాలకు ప్రయోజనకరంగా ఉంటాయి. సుదీర్ఘకాలంలో వడ్డీరేటు తగ్గింపుల నుంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. ఆర్బీఐ రెపో రేటును తగ్గించినప్పుడు, బెంచ్‌మార్క్ రేటు తగ్గినప్పుడు ఫ్లోటింగ్ రేటు కూడా తగ్గుతుంది. అంటే.. ఇంటి రుణంపై వడ్డీరేటు కూడా తగ్గుతుంది. దాంతో, నెలనెలా కట్టాల్సిన ఈఎంఐ కూడా తక్కువ అవుతుంది. అంతేకాదు, పలు బ్యాంకులు/ఆర్థిక సంస్థలు.. రుణాలను ముందస్తుగా చెల్లిస్తే పెనాల్టీని వసూలు చేస్తుంటాయి.

అదే.. ఫ్లోటింగ్: వడ్డీరేట్‌లో తీసుకున్న రుణాలకు ఈ సమస్య ఉండదు. కాబట్టి, ఎలాంటి ఇబ్బంది లేకుండానే రుణాలను ముందస్తుగా తీర్చే అవకాశం ఉంటుంది. అదే సమయంలో.. ఫ్లోటింగ్ వడ్డీరేట్లకు కొన్ని ప్రతికూలతలు కూడా ఉంటాయి. ఆర్బీఐ రెపోరేటు పెంచినప్పుడు, బెంచ్‌మార్క్ రేటు కూడా పెరుగుతుంది. అప్పుడు మీరు చెల్లించాల్సిన వడ్డీ రేటుతోపాటు ఈఎంఐ లేదా రుణ కాలవ్యవధి పెరుగుతుంది. ఇది.. తక్కువ ఆదాయ వర్గాలకు ఇబ్బందికరంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈఎంఐ డిఫాల్ట్ అయితే.. క్రెడిట్ స్కోరు తగ్గిపోతుంది. అందుకే ఫ్లోటింగ్ వడ్డీ రేటుతో లోన్ తీసుకునేటప్పుడు అన్ని విషయాలూ ముందుగానే చూసుకోవాలి... ఈ రెండిట్లో ఏ వడ్డీరేటును ఎంచుకోవాలనేది వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా అప్పులు తిరిగి చెల్లించగలిగే సామర్థ్యం, రుణగ్రహీతల ఆర్థిక స్తోమతను బట్టి నిర్ణయాలు తీసుకోవాలి. దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నవారు, ప్రతినెలా చెల్లించే ఈఎంఐ మారకూడదని అనుకునేవారికి ఫిక్స్‌డ్ వడ్డీరేటు బాగుంటుందని నిపుణులు చెబుతున్నారు. బ్యాంకుల్లో వడ్డీరేట్లు తగ్గే అవకాశాలు ఉన్నప్పుడు, తక్కువ సమయంలోనే రుణాలు తీర్చేస్తామని అనుకునేవారు ఫ్లోటింగ్ వడ్డీరేట్లు ఎంచుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.

# సాధనతో సాధ్యమే




చిన్నప్పుడు చదివిన కుందేలు, తాబేలు పరుగు పందెం కథ గుర్తుంది కదా!నిర్లక్ష్యం ఎంత ప్రమాదమో ఆ కథ చెబుతుంది. అలాగే పట్టుదలే గెలుపుబాట అని చూపుతుంది. ఆ తాబేలు పరుగునే ఆదర్శంగా తీసుకుంది ప్రముఖ ఆంత్రప్రెన్యూర్ వినీతా సింగ్. సోనీ టీవీలో ప్రసారమయ్యే 'షార్క్ ట్యాంక్ ఇండియా' కార్యక్రమం జడ్జిగా కూడా సేవలు అందిస్తున్నది. చిన్నప్పటి నుంచి వినీతకు నడక అంటే ఇష్టం. మారథాన్ పరుగులో నిర్దేశిత సమయంలో లక్ష్యాన్ని అందుకోవాలని ఉండేది.వేగాన్ని, దూరాన్ని పట్టించుకోకుండా తన సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నది. మొదట్లో చాలా సమయంపాటు నడిచేదట. కొన్నాళ్లకు నడక వేగం పెంచింది. ఇంకొన్నాళ్లకు పరుగు అందుకుంది. వారం వారం దూరాన్ని పెంచుకుంటూ పరుగు తీసింది. పదిహేడేండ్లుగా పరుగు ఒక కళగా సాధన చేసింది. ఇటీవల జరిగిన ముంబయి మారథాన్‌లో 42 కిలోమీటర్ల దూరాన్ని 3 గంటల 58 నిమిషాల 21 సెకన్లలో చేరుకుని 'ఔరా!' అనిపించుకుంది. 'జీవితంలో ఏదైనా సాధించాలనే ప్రయత్నంలో వెంటనే విజయాన్ని ఆశించడం తప్పు కాదు. అయితే, దానికి తగినంత సామర్థ్యాన్నిపెంపొందించుకోవాలి. పరిస్థితులు అనుకూలించకపోయినా.. నిరుత్సాహపడొద్దు. అన్నిటినీ మించి పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు' అని చెప్పుకొచ్చింది వినీత.

# భయం నుంచే కోపం..!

కోపం, క్రోధం, ఆగ్రహం.. భయం-అన్నీ ఒక్కటే. కోపం తాటాకు మంటలా క్షణికం అయితే, క్రోధం చింతనిప్పులా తీవ్రతరం.. దీర్ఘకాలికం అని చెబుతారు. మనిషన్న తర్వాత కోపం సహజం. కానీ, అది క్రోధంగా మారకూడదు. ఈ క్రోధం ఎదుటివారిని ఎంతవరకూ కాలుస్తుందో తెలియదు కానీ, తనను మాత్రం తక్షణం కాలుస్తుంది. విచక్షణ కోల్పోయేలా చేస్తుంది. ఓ సింహం తన కంటబడిన కోతిని వెంటాడుతుంది. అది ప్రాణ భీతితో ఎత్తైన చెట్టు ఎక్కింది. కోతి తప్పించుకుందన్న అక్కసు, ఆక్రోశంతో ఊగిపోయిన సింహం పట్టలేని క్రోధంతో ఆ చెట్టును కూల్చేస్తుంది. అది కాస్తా తనమీదే పడటంతో.. ఆ చెట్టుకింద పడి సింహం చచ్చిపోతుంది. అందుకే 'తన కోపమే తన శత్రువు' అంటారు. 'విచక్షణా జ్యోతి.. కోపమనే సుడిగాలికి కొండెక్కుతుంది' అన్న అమెరికన్ తత్వవేత్త రాబర్ట్ ఇంగర్ సాల్ మాట అక్షర సత్యం. ఎర్రగా కాలిన నిప్పు కణికలను ఎవరిపైనైనా విసరాలనుకుంటే.. ముందు మన చెయ్యి కాలుతుందన్న విషయం మర్చిపోకూడదు. కోపం భయం మధ్య సంబంధం చాలా సంక్లిష్టమైనది.. సహజమైనది. అది లింగవివక్షనూ వదిలిపెట్టలేదు. తత్వవేత్త మార్తా నస్బామ్ 'యాంగర్ అండ్ ఫర్గివ్‌నెస్'లో రాసినట్లుగా.. 'మగ' అనే లేబుల్ వేయబడిన శిశువు ఏడుపు సాధారణంగా కోపంగా వున్నట్లు అర్థం చేసుకుంటారు. కానీ ఏడుస్తున్న ఆడపిల్ల 'భయం'తో ఏడుస్తున్నట్లుగా పరిగణించబ డుతుంది. ఇక్కడ ఏడుస్తున్న చర్య ఒక్కటే. వివరణ మాత్రం లింగపరమైనది. కోపంగా వున్న స్త్రీ ఉన్మాదంగా వుంటుంది. ఆమెలో ఏదో తప్పు వుంది. అదే కోపంగా వున్న పురుషుడు వీరుడు. ఈ వివక్ష సమాజ దృక్కోణంలోనే కాదు, కోపం వ్యక్తీకరణలోనూ వేళ్లూనుకుంది.

కోపం, పగ, ద్వేషం..వంటి వాటిని బలమైన అంశాలుగా సినిమాల్లో, కథలు, పురాణాల్లో చూస్తాం. అన్యాయాన్ని సరిచేయడం, న్యాయాన్ని పరిరక్షించడం ఒక భాగం. అయితే, పగ తీర్చుకోవడం అనేది ధైర్యానికి సూచిక అనుకుంటారుగానీ, వాస్తవానికది భయానికి ప్రతీక. తన సోదరికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలన్న రావణుడి ప్రయత్నం లంక నాశనానికి కారణమైంది. 'ప్రతి మనిషిలోనూ 160 రకాల భయాలుంటాయి' అంటాడు మనస్తత్వ శాస్త్ర పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్. ఏదోక విషయంలో అతిగా భయపడేవాళ్లే ఎక్కువ కోప్పడతారన్నది నిరూపితమైన అంశం. ఔరంగజేబు అప్పుడెప్పుడో ఏదో చేశాడని, ఇప్పుడు పగ తీర్చుకోవాలనుకోవడం, ఆతని సమాధి తవ్వేయాలనుకోవడం అంటే%ౌ% భయం వల్ల కాక మరేమిటి? దేశ జనాభాలో మైనారిటీగా వున్న ముస్లిం, మైనారిటీల పట్ల అంత భయం ఎందుకు? చేతగానితనాన్ని, అసమర్థతని కప్పిపుచ్చుకోడానికి ప్రజల దృష్టి మళ్లించడానికి భయంతో చేస్తున్న ఎదురుదాడి తప్ప మరోటి కాదు.నెల్సన్ మండేలా తన జీవితమంతా నిర్బంధంలోనే గడిపారు. ఆయన బయటికి వచ్చిన తర్వాత దీనికి కారణమైన వారిపై తప్పుడు కేసులు పెట్టి, పగ తీర్చుకునే ప్రయత్నం చేయలేదు. దానికి ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, దాని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. అందువల్లే ఆయన ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నారు. గాంధీ హిందూ మతానికి ఏదో ద్రోహం చేశాడన్న పేరుతో గాడ్సే ఆయన్ని కాల్చి చంపాడు. నిజానికి మత ఘర్షణల చిచ్చు నుంచి భారతదేశాన్ని కాపాడినందుకు ఆయనంటే వాళ్లకి భయం. కోపం, పగ, ద్వేషం నుంచి మానవత్వ విలువలు పెరగవు. కోపం మానవత్వాన్ని హరిస్తుంది. విచక్షణ మందగిస్తుంది. అప్పుడిక మనిషి పశుప్రాయుడే. ఇదొక ఆటవిక లక్షణం మాత్రమే. ఈ తరహా జంతు లక్షణాలను గొప్పగా చిత్రీకరించుకొని సినిమాల్లోనే కాకుండా జీవితంలో కూడా ఆ కోపం ప్రదర్శించకపోతే నువ్వేదో చేతగాని వాడనుకుంటారేమోనన్న భయం. కోపం యొక్క గుండె తరచుగా ప్రతీకారాన్ని కోరుకుంటుంది' అంటారు నస్బామ్. ఈ మానవ బలహీనతను తమ రాజకీయ ప్రయోజనాలకు రెచ్చగొట్టి వాడుకోజూసే వారిలో మానవత్వం వుంటుందా? వారిని నాగరికులుగా పరిగణించగలమా?

# ట్రంప్ సర్కార్ ఉక్కుపాదం..




న్యూఢిల్లీ: అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విదేశీ విద్యార్థులను రారంపాన పెడుతున్నది.నిబంధనల ఉల్లంఘన పేరుతో వారి వీసాలను అడ్డగోలుగా రద్దు చేస్తున్నది. అలా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 6 వేల మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. వారిలో 4వేల మంది చట్టాల ఉల్లంఘన, డ్రంకెన్ డ్రైవ్, దాడులు, దోపిడీ లాంటి నేరాలకు పాల్పడినట్టు పేర్కొన్నది.

## 6 వేల మంది విద్యార్థుల వీసాలు రద్దు

'హమాస్' ఉగ్రవాద సంస్థకు నిధులు సమీకరిస్తున్నందుకు ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం (ఐఎన్ఏ)లోని నిబంధనల కింద మరో 200-300మంది విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సంఖ్యలు అన్ని క్యాటగిరీల్లో పెరుగు తున్న వీసా రద్దుల్లో కేవలం ఒక భాగం మాత్రమే. అమెరికాలో ఈ ఏడాది ఇప్పటివరకు అన్ని క్యాటగిరీల్లో కలిపి దాదాపు 40 వేల వీసాలు రద్దయ్యాయి. ఇవి అంతకుముందు జో బైడెన్ ప్రభుత్వ హయాంలో రద్దయిన 16 వేల వీసాల కంటే చాలా అధికం. అమెరి కా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక ఉన్నత విద్యావ్య వస్థను పునర్వ్యవస్థీకరించే పనిలో పడిన ట్రంప్.. ప్రధాన విశ్వవిద్యాలయాలను దృష్టిలో పెట్టుకుని విధానపరమైన మార్పులు చేపట్టారు. కీలక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేటాయించిన నిధుల్లో భారీగా కోత విధించడంతోపాటు వర్సిటీ క్యాంపస్‌లలో ఆందోళనలకు దిగే విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు.

# రైల్వే ప్రయాణికులకు షాకింగ్ న్యూస్..

## ఇకపై రైళ్లలో ఎంత లగేజీ పడితే అంత తీసుకెళ్లలేరు!



ప్రయాణికులకు కఠినమైన లగేజీ నిబంధనలు అమలు చేయడానికి రైల్వే శాఖ సిద్ధమవుతున్నది. ఇందుకోసం విమానాశ్రయాల తరహా విధానాన్ని అమలు చేయనున్నట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక తెలిపింది. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాల్లో తమ లగేజీ బరువును తనిఖీ చేయించుకోవాలి. నిర్ణీత బరువు కంటే ఎక్కువ లగేజీ కలిగి ఉన్నా లేదా నిర్ణీత బరువుకు లోబడి ఉన్నా.. భారీ సైజులో ఉన్న లగేజీకి అదనపు రుసుము లేదా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఏసీ మొదటి తరగతి ప్రయాణి కులు 70 కిలోలు, ఏసీ 2టైర్ ప్రయాణికులు 50 కిలోలు, ఏసీ 3టైర్, స్లీపర్ ప్రయాణికులు 40 కిలోలు, సాధారణ తరగతి ప్రయాణి కులు 35 కిలోల వరకు లగేజీ తీసుకెళ్లేందుకు అనుమతించనున్నారు. మొదట ఉత్తర మధ్య రైల్వే జోన్‌లోని ప్రముఖ రైల్వే స్టేషన్లలో ఈ నిబంధనను అమలు చేయాలని భావిస్తున్నారు. లగేజీ బరువు తనిఖీ పూర్తయ్యాకే ప్రయాణికులను ప్లాట్‌ఫామ్ మీదకు వెళ్లేందుకు అనుమతిస్తారు. మరోవైపు ఆదాయం, ప్రయాణికుల సౌకర్యం కోసం ఆధునీకరించిన స్టేషన్లలో దుస్తులు, చెప్పులు, ఎలక్ట్రానిక్స్, ప్రయాణ ఉపకరణాలు అమ్మే ప్రీమియం సింగిల్-బ్రాండ్ స్టోర్లను ప్రారంభించాలని రైల్వే శాఖ యోచిస్తున్నది.

# స్థలంలో ఇళ్లు కట్టకపోతే తిరిగి ఇచ్చేయండి

## గృహ నిర్మాణ సంస్థ నోటీసులు జారీ..

**నెల్లూరు,తెలంగాణ దిశ :** ఏపీలో వారందరికీ బ్యాడ్ న్యూస్.. డబ్బులు వెనక్కి ఇచ్చే యాలని ఏపీ గృహ నిర్మాణ సంస్థ నోటీసులు జారీ చేస్తోంది. ఇంటి పట్టాలు పొందిన తర్వాత అందులో ఇంటి నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం లబ్ధిదారులకు అడ్వాన్సులు కూడా అందించింది. అయితే అడ్వాన్స్ పొందిన తర్వాత కూడా కొంతమంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో అలాంటి వారికి ఏపీ గృహ నిర్మాణ సంస్థ నోటీసులు జారీ చేస్తోంది. ఇంటి పనులు ప్రారంభించాలని.. కుదరకపోతే డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని నోటీసులు ఇస్తోంది.ఏపీలో ఇంటి నిర్మాణాల కోసం ఇళ్ల పట్టాలు పొంది.. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి అడ్వాన్సులు పొందిన లబ్ధిదారులకు అధికారులు షాక్ ఇస్తున్నారు. వీలైతే ఇంటి నిర్మాణం చేపట్టాలని.. లేకపోతే ప్రభుత్వం అందించిన అడ్వాన్స్ నగదు తిరిగి చెల్లించాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇంటి నిర్మాణం కోసం పట్టాలు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన స్థలాలలో వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రజలకు ఒక్కో ఇంటికి రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకూ అడ్వాన్స్ రూపంలో అందించారు. నిర్మాణాలు చేపట్టలేదు. స్థలం నచ్చకో లేదా ప్రభుత్వ సాయం తక్కువగా ఉందనే కారణంతోనో తెలియదు కానీ.. కొన్నిచోట్ల ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేదు.మరోవైపు ప్రస్తుత ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం ఎస్సీ, బీసీ సామాజికవర్గాల లబ్ధిదారులకు అదనపు సాయం రూపంలో రూ.50 వేలు చెల్లిస్తోంది. అలాగే ఎస్టీ సామాజికవర్గాల వారికి రూ.75 వేలు చొప్పున అందిస్తున్నారు. ఈ సాయం పొందిన తర్వాత కొంత మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభి ంచగా.. మరికొందరు మాత్రం ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదు. ఈనేపథ్యంలో అలాంటి వారిలో కదలిక తెచ్చేందుకు.. అలాంటి వారికి ఏపీ గృహ నిర్మాణ సంస్థ అధికారులు నోటీసులు జారీ చేస్తు న్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభించాలని.. అలా వీలు కాకపోతే ప్రభుత్వం అందించిన అడ్వా న్స్ తిరిగి చెల్లించాలని నోటీసులు ఇస్తున్న పరిస్థితి. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించి.. ఆ తర్వాత వాటిని నిలిపివేసిన కుటుంబాలకు.. తిరిగి ఇల్లు కట్టుకునేందు కు ఏపీ ప్రభుత్వం అడ్వాన్సులు అందించింది. కేంద్ర ప్రభుత్వ పథక మైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అలాంటి వారికి అడ్వాన్సు లు అందించారు.

అయినప్పటికీ కొంతమంది పనులు ప్రారంభించ కపోవటంతో ఏపీగృహ నిర్మాణ సంస్థ అధికారులు ఈ చర్యలు తీసుకుంటున్నారు. పేదలకు పక్కా ఇళ్లు ఉండాలనేది ప్రభుత్వం ఉద్దేశమన్న గృహ నిర్మాణ సంస్థ అధికారులు.. అడ్వాన్సులు తీసుకున్న తర్వాత కూడా ఇంటి నిర్మాణాలు చేపట్టని వారికి నోటీసులు ఇస్తున్నామ న్నారు. నోటీసులు అందజేసి పనులు చేపట్టాలని సూచిస్తున్నట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారులు చెప్తున్నారు. ఒక వేళ.. అప్పటికీ ఇంటి నిర్మాణానికి ముందుకు రాకపోతే అలాంటి వారి నుంచి అడ్వాన్స్ నగదు రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు

# డిజిటల్ విద్యాభోధనకు ఆర్ధిక సాయం

**గుంటూరు,తెలంగాణ దిశ :** భిన్న ప్రతిభావంతులు, దివ్యాంగుల కోసం ఏపీ సమగ్ర శిక్షా అభియాన్ కీలక చర్యలు తీసుకుంటోంది. విభిన్న ప్రతిభావం తులకు డిజిటల్ విద్యా బోధనతో పాటుగా వారికి ఆర్థికంగా చేయూత అందిస్తున్నారు. సర్వే ద్వారా విభిన్న ప్రతిభావంతులను గుర్తించి స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పుతున్నారు. అనంతరం స్కూలుకు వచ్చేందుకు రవాణా భత్యం చెల్లిస్తున్నారు. సహాయకులను ఏర్పాటు చేసుకుంటే సహాయకులకు కూడా భత్యం చెల్లిస్తున్నారు. దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతూ ఉంటాయి. వారి సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుంటాయి. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతుల కోసం ఏపీ సమగ్ర శిక్షా అభియాన్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. వారికి చదువు నేర్పడంతో పాటు భవిష్యత్తుకు బాటలు వేసేలా కీలక చర్యలు తీసుకుంటోంది. విభిన్న ప్రతిభావంతులను సాధారణ పాఠశాలల్లో చేర్పించడంతో పాటుగా.. వారికి ట్యాబ్‌ల ద్వారా బోధన అందిస్తున్నారు. ఈ ట్యాబ్‌లో 33 రకాల యాప్‌ల సాయంతో డిజిటల్ విద్యా బోధన చేస్తోంది. అలాగే ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల కోసం దేశంలో తొలిసారిగా ఏపీలోని పట్టణాల్లో 125 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు.మరోవైపు విభిన్న ప్రతిభావంతులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. సర్వేలో గుర్తించిన అనంతరం వారిని సమీపంలోని గవర్నమెంట్ స్కూళ్లల్లో నమోదు చేస్తున్నారు. అలాగే ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీలను భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ప్రత్యేకంగా ట్రైనింగ్ తీసుకున్న ఉపాధ్యాయులతో వారికి విద్యాబోధన చేయిస్తున్నారు. ఇక స్కూలుకు కూడా రాలేని చిన్నారుల కోసం ప్రతి శనివారం ఇంటి వద్దనే బోధన చేస్తున్నారు. అలాగే దివ్యాంగులైన విద్యార్థులకు రవాణా భత్యం కింద నెలకు రూ.600 అందిస్తోంది ప్రభుత్వం. బాలికలైతే మరో 200 రూపాయలు అదనంగా రవాణా భత్యం చెల్లిస్తున్నారు. సొంతంగా స్కూలుకు రాలేని దివ్యాంగ విద్యార్థులు సహాయకులను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించేందుకు సహాయకుల భత్యం కూడా అందిస్తున్నారు. అలాంటి వారికి నెలకు రూ.600 చొప్పున చెల్లిస్తున్నారు.మరోవైపు విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల చదువును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు చెప్తున్నారు. పాఠశాలల్లో వీరి ప్రవేశాలు పెంచేందుకు, ఆర్థిక చేయూత కూడా అందిస్తున్నట్లు చెప్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. సాధారణ పిల్లలతో పోల్చితే వీరు ఎందులోనూ తీసిపోరంటున్న అధికారులు.. ఆ నమ్మకం వారిలో కలిగించి, వారి సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్తున్నారు.

# పెరిగిన రిజిస్ట్రేషన్ల ఆదాయం




**విజయవాడ,తెలంగాణ దిశ:** ఏపీలో రియల్ ఎస్టేట్‌కు మంచి రోజులు వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా పుం జుకుంటోందని రియల్ ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి. గతేడాది మొదటి త్రైమాసికంతో పోలిస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో పెరిగిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం.. రియల్ ఎస్టేట్ పుంజుకుంటోందని చెప్పడానికి సంకేతంగా చెప్తున్నారు. అమరావతితో పాటుగా ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు చేపడుతున్న ప్రాంతాల్లోనూ భూలావాదేవీలు పెరుగుతున్నాయని.. భూముల ధరలు పెరుగుతు న్నాయని చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా పుంజుకుంటోంది. కొన్నేళ్లుగా ఏపీలో స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం కార్యకలాపాలు క్రమంగా పెరుగుతున్నాయని నిపుణులు చెప్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారని.. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా భూ లావాదేవీలు పెరిగాయని చెప్తున్నారు. అలాగే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం పెరగటం కూడా ఏపీలో రియల్ ఎస్టేట్ పుంజుకుంటోందనడానికి సంకేతాలని వెల్లడిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంతో పోలిస్తే.. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఏపీలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 46 శాతం పెరిగిందని లెక్కలు చెప్తున్నాయి. ఇక వృద్ధి రేటు కూడా 39 శాతంగా ఉందని.. రియల్ ఎస్టేట్ రంగం రికవరీ చెందిందనడానికి ఇదో సంకేతమని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు.అమరావతిలో సుమారుగా 50 వేల కోట్ల విలువైన పనులు మొదలు కావటంతో అమరావతి నిర్మాణంపై ఇన్వెస్టర్లలో నమ్మకం పెరిగిందని తెలుస్తోంది. దీంతో అప్పటి వరకూ వేచి చూసే ధోరణిలో ఉన్న పెట్టుబడిదారులు.. రాజధానిపై ఆసక్తి చూపటం మొదలుపెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం డేటాను విశ్లేషిస్తే..కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలలో భూలావాదేవీలు అధికంగా జరిగాయి. అలాగే ఆదాయం కూడా ఈ ప్రాంతాల నుంచి ఎక్కువగా సమకూరింది. దీంతో ఏపీలో రియల్ ఎస్టేట్ రంగాన్ని అమరావతి నడిపిస్తోందనే విశ్లేషణలు వస్తున్నాయి. దీంతో అమరావతితో పాటుగా.. ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి.మరోవైపు 2024 ఎన్నికల ఫలితాల తర్వాత అమరావతిలో భూముల ధరలు అమాంతం పెరిగాయని రియల్టర్లు చెప్తున్నారు. రేట్లు పెరగటంతో లావాదేవీలు తగ్గిపోయాయని వివరిస్తున్నారు. అయితే అమరావతిలో భూముల ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ.. డెవలపర్లు, ఇన్వెస్టర్లు..

అందుబాటులో రేట్లు ఉండి, భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉండే ప్రాంతాలను అన్వేషిస్తున్నారని చెప్తున్నారు. అమరావతి మాత్రమే కాకుండా గుంటూరు, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం, కర్నూలు వంటి ప్రాంతాలలోనూ భూలావాదేవీలు పెరిగినట్లు చెప్తున్నారు. ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు ప్రకటించిన ప్రాంతాల్లోనూ భూములకు డిమాండ్ పెరిగిందని రియల్ ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి.

అలాంటి గ్రామీణ ప్రాంతాలు అయినప్పటికీ కొనుగోలుదారులు ముందుకు వస్తున్నారని వెల్లడిస్తున్నాయి. మరోవైపు లేఅవుట్లు, భవనాలకు సంబంధించిన అనుమతుల విషయంలో ప్రభుత్వం నిబంధనలను సడలించడం కూడా రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిస్తోందని కొంతమంది రియల్టర్లు చెప్తున్నారు. ఇక నాలా కన్వర్షన్ ఫీజులను రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే లావాదేవీలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# కొత్త ఉద్యోగాల్లో మందగమనం




## ద్వితీయార్థంలో 70 శాతం తగ్గొచ్చు
## టీమ్‌లీస్ ఎడ్‌టెక్ రిపోర్ట్

న్యూఢిల్లీ: దేశంలో కొత్త ఉద్యోగ నియామకాలు అమాంతం పడిపోనున్నాయని రిపోర్టులు హెచ్చరిస్తున్నాయి.

ట్రంప్ టారిఫ్‌లతో అంతర్జా తీయ వాణిజ్య అనిశ్చితులకు తోడు దేశీయంగా డిమాండ్ తగ్గడం, కృత్రిమ మేధ (ఏఐ) తదితర పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ద్వితీయార్థంలో అభ్యర్థులకు గడ్డుకాలమేనని టీమ్‌లీస్ ఎడ్‌టెక్ కెరీర్ తన రిపోర్ట్‌లో వెల్లడించింది.

202జులై నుంచి డిసెంబర్ కాలంలో ఫ్రెషర్ల నియామకాలు ఏకంగా 70శాతం తగ్గనున్నట్లు వెల్లడించింది. జనవరి నుంచి జూన్ కాలంలోని ప్రథమార్థంతో పోల్చితే నాలుగు శాతం పాయింట్ల తగ్గుదల చోటు చేసుకోనుందని విశ్లేషించింది. మే నుంచి జులైలో నిర్వహించిన ఈ అధ్యయనంలో 1065 సంస్థల అభిప్రాయాలను సేకరించింది.

టీమ్‌లీస్ ఎడ్‌టెక్ రిపోర్ట్ వివరాలు.. నూతన నియామకాల్లో తగ్గుదలను సూచిస్తున్నప్పటికీ.. పలు రంగాల్లో మాత్రం కొంత ఆశాజనంగా ఉంది. ఇ-కామర్స్, రిటైల్, ఐటి రంగాలు డిజిటల్ రూపాంతరంతో ఆశాజనకంగా ఉన్నాయి. సాంకేతిక, సాఫ్ట్ స్కిల్స్ కలిగిన ఫ్రెషర్‌లకు అవకాశాలు దక్కొచ్చు. చిన్న సంస్థలు ఫ్రెషర్‌లను నియమించేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయి.


ఐఒటి ఇంజనీర్, క్లౌడ్ ఇంజనీర్, జూనియర్ వెబ్ డెవలపర్, కంటెంట్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వంటి పాత్రలకు డిమాండ్ ఉంది.

అప్రంటిష్ నియామకాల్లో బెంగళూరు, చెన్నరు, పూణే నగరాలు ముందు వరుసలో ఉన్నాయి. ఇ-కామర్స్,టెక్నాలజీ స్టార్టప్‌లలో బలమైన నియామకాలకు అవకాశాలున్నాయి.

టీమ్‌లీస్ ఎడ్‌టెక్ వ్యవస్థాపకుడు శాంతను రూజ్ పేర్కొన్నారు. పెద్ద సంస్థలతో పోల్చితే చిన్న సంస్థల్లోనే ఎక్కువ నియామకాలు ఉండొచ్చన్నారు. తయారీ, ఐటి రంగాల్లో బహుళ నైపుణ్యాలు ఉన్న వారికే ఎక్కువ అవకాశాలు దక్కుతున్నాయన్నారు. అయితే ఏఏ రంగాల్లో ఉద్యోగాలు తగ్గొచ్చనే విషయాన్ని టీమ్‌లీస్ తన రిపోర్ట్‌లో స్పష్టం చేయకపోవడం గమనార్హం.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ఒక వ్యక్తి 03 రోజుల జైలు శిక్ష

**గోదావరిఖని,తెలంగాణ దిశ :** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్‌డ్రైవ్ లో దొరికిన 4 మందిని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని, శ్రీ వెంకటేష్ దుర్వ గారి ముందు హాజరుపరుచగా 3 గురికి 9,000/- రూపాయల జరిమానా విధించారు. ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్న రెండవసారి పట్టుబడిన కొల్లూరి ప్రసాద్‌కు 03 రోజుల జైలు శిక్ష విధించారు. కరీంనగర్ జిల్లా జైలుకు తరలించడం జరిగింది.




# ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్యే!

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :** ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. మరో 15 ఏళ్ల పాటు కూటమి కొనసాగుతుందని అధినేతలు భావిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తుంటే అందుకు విరుద్ధంగా ఉంది. మూడు పార్టీల సమన్వయ లోపం స్పష్టమవుతోంది. ఏకంగా అసెంబ్లీ వేదికగా బిజెపి ఎమ్మెల్యే ఒకరు.. టిడిపి ఎమ్మెల్యే పై ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కుట్రలు చేస్తున్నారని.. వైసీపీ నేతలతో చేతులు కలిపారని.. వ్యతిరేక మీడియాలో కథనాలు రాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితి వచ్చింది. కూటమి పార్టీల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ అవుతోంది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పై అసెంబ్లీ వేదికగా సంచలన ఆరోపణలు చేశారు.శ్రీకాకుళం జిల్లాలో పొత్తులో భాగంగా ఎచ్చెర్ల స్థానాన్ని బిజెపికి కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా నడికుదుటి ఈశ్వరరావు పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. అయితే ఎచ్చెర్ల నియోజకవర్గంలో క్వారీలు అధికంగా ఉంటాయి. ఈ తరుణంలో గత వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున క్వారీలకు అనుమతులు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఆ మరుసటి రోజే ఓ క్వారీ తవ్వకాలకు సంబంధించి వైసీపీ నేతకు భూగర్భ గనుల శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. సదరు నేత క్వారీలో గ్రావెల్ తవ్వకాలకు సిద్ధపడగా స్థానికులు అడ్డుకున్నారు. అదే విషయంపై ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన సైతం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్వారీకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దని సూచించారు. అప్పటినుంచి వివాదం నడుస్తూనే ఉందిఅయితే సదరు క్వారీ యాజమాన్యం నుంచి ఎచ్చర్ల ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని.. ముడుపులు ఆశిస్తున్నారని.. ఇవ్వకపోవడం వల్లే ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నారు అంటూ ప్రభుత్వ వ్యతిరేక మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే సదరు క్వారీ యజమాని కి అనుకూలంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వ్యవహరిస్తున్నారు. భూగర్భ గనుల శాఖ అధికారులపై నేరుగా ఒత్తిడి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఎచ్చెర్ల నియోజకవర్గంలో రవికుమార్ ప్రమేయంపై విమర్శలు ఉన్నాయి. సదరు క్వారీ యజమాని వైసీపీ నేత అయినా.. రవికుమార్ మద్దతు తెలపడం పై మాత్రం కూటమి పార్టీల నేతల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అయితే ఇటీవల వరుస కథనాలు రావడంతో ఎచ్చర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. సాటి కూటమి ఎమ్మెల్యే తనపై ఇలా వ్యవహరించడం పై ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారుప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా నిన్న జీరో అవర్లో ఎచ్చర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు మాట్లాడారు. తన మనసులో ఉన్న బాధను వ్యక్తపరిచారు. ఆయన తనపై కుట్ర చేశారని.. లేనిపోని ఆరోపణలు చేయిస్తున్నారని.. వ్యతిరేక మీడియాలో కథనాలు రాయిస్తున్నారని.. తనకు ఏ సంబంధం లేదని.. దేవుడు పై ప్రమాణం చేస్తున్నాను అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## నా బార్డ్ నిధులతో గోదాములు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో మూడేళ్లలో ధాన్యం ఉత్పత్తి మూడు రెట్లు పెరిగినప్పటికీ వాటిని నిల్వ చేసేందుకు అవసరమైన మేరకు గోదాములు లేవు. దీంతో కొత్తగా 26 గోదాములను నిర్మించేందు కు రాష్ట్ర సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. వీటిలో 12 గోడౌన్లను ప్రభుత్వ నిధులతో, మరో 14 గోదాములను నాబార్డు నిధులతో నిర్మిస్తుంది. వీటి కోసం రూ. 295.68 కోట్లు ఖర్చుచేస్తుంది. 2.91 లక్షల టన్నుల స్టోరేజీతో గోదాముల నిర్మాణం జరగనుంది. వేర్ హౌజింగ్ శాఖ ఆధ్వర్యంలో 12 గోదాములను, 1.51 లక్షల టన్నుల స్టోరేజీ సామర్థ్యంతో నిర్మిస్తారు. నాబార్డు సహకారంతో 14 గోదాములను రూ. 140 కోట్ల రుణాలతో 1.40 లక్షల టన్నుల సామర్థ్యంతో ఉండేలా గోడౌన్ల నిర్మాణం చేపట్టారు. పర్యావరణ అనుకూల పంథాలో వీటి నిర్మాణం ఉంటుంది. అందులోని పంటలకు ఎలుకలు, చీడపీడల బెడద లేకుండా చేసేందుకు గాలి వెలుతురు ఉండేలా స్టోరేజ్ వృథాను నివారించేలా నిర్మిస్తారు. కాగా, 2024-25 ఏడాది తెలంగాణలో 190 లక్షల టన్నుల ధాన్యంతో పాటు 30 లక్షల టన్నుల మక్కల దిగుబడి వచ్చింది. అలాగే, 28 లక్షల టన్నుల పత్తితో పాటు 20 లక్షల టన్నుల ఇతర పంటల దిగుబడి వచ్చింది. వాటిని నిల్వచేసుకోవడానికి గోదాములు సరిపోవడం లేదు. రైతులు ప్రతి ఏడాది పంటలను నిల్వచేసుకోవడానికి అనేక సమస్యలు ఎ దుర్కొంటున్నారు. గోదాములు అవసరాల మేరకు లేకపోవడంతో పంట తేమ పెరగడం, తడిసిపోవడం, ఎలుకలు, పురుగులు పడుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో తెలంగాణ వ్యాప్తంగా 24.59 లక్షల టన్నుల సామర్థ్యమున్న 253 గిడ్డంగులు ఉన్నాయి. అయితే, అవి సంప్రదాయ నమూనాలో ఉండడంతో, వాటి నిర్వహణలో ఇబ్బందులు వస్తున్నాయి.

# పాలకులు కూల్చేస్తే.. ప్రజలు నిలబెట్టారు!





అన్యాయాన్ని, అక్రమాన్ని తన కలం గళంతో గట్టిగా వినిపించినందుకు జమ్మూలో ఉంటున్న ఓ ముస్లిం జర్నలిస్టు ఇంటిని అధికారులు ఇటీవల నిట్టనిలువునా కూల్చేశారు. కుప్పకూలిన ఆ ఇంటి ముందు నిరాశ్రయంగా ఆ జర్నలిస్టు వృద్ధ తల్లిదండ్రులు, భార్యా పిల్లలు బిక్కుబిక్కుమంటూ ఉంటే, వాళ్లని చూసి ఇంటిని కూల్చిన వారు తెగ సంతోషపడిపోయారు. అయితే అది వారికి క్షణం కాలం మాత్రమే మిగిలింది. ఆ ముస్లిం జర్నలిస్టు కుటుంబానికి 'నేనున్నా' అంటూ ఓ హిందు సోదరుడు ముందుకు వచ్చాడు. కూల్చేసిన భూమికి రెట్టింపు భూమిని అతనికి బహుమతిగా ఇచ్చాడు. 'కులాలు, మతాలు వేరైనా మేమంతా మనుషులం. మత సామరస్యంతో మెలగడం మా నైజం' అంటూ అక్కడున్న వారికే కాదు, దేశం నలుమూలలా వినపడేంత గట్టిగా చెప్పాడు. మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్న ముఠాతో ఓ పోలీసు అధికారికి ఉన్న సంబంధాల గుట్టును రట్టు చేసిన ఆ పాత్రికేయుడు అర్ఫజ్ అహ్మద్ డయాంగ్. 'నీస్ సహర్ ఇండియా' పేరుతో డిజిటల్ న్యూస్ పోర్టర్‌ని అతను నిర్వహిస్తున్నాడు. అక్రమ రవాణాలో పోలీసు సంబంధాల వార్త అక్కడి ప్రజల్లో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు అప్రమత్తమయ్యారు. అర్ఫజ్‌పై బెదిరింపులకి దిగారు. చివరికి సరైన పత్రాలు లేవంటూ అతని ఇంటిని కూల్చేశారు. అడ్డుకొన్న అర్ఫజ్‌ని పోలీసులు నోటికొచ్చినట్లు దుర్భాషలాడారు. కొట్టారు. 'తమకి కొంచెం సమయం ఇవ్వమ'ని అర్ఫజ్ కుటుంబ సభ్యులు అధికారుల కాళ్లావేళ్లా పడడం అక్కడున్న వారి గుండెలు బరువెక్కించింది. అయినా వారు కనికరం చూపలేదు. అప్పుడే ఆ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త కులదీప్ శర్మ వారికి అండగా నిలబడ్డారు. అర్ఫజ్ తిరిగి ఇంటిని నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. 'నిధుల కోసం దాతలను అడుక్కోవాల్సి వచ్చినా సరే మీ కోసం ఇంటిని కట్టిస్తాను. ముస్లింలకు హిందువులను వ్యతిరేకులుగా చిత్రీకరించే కుట్ర ఎన్నటికీ విజయం సాధించదు. మన మధ్య సోదరభావం చిరకాలం కొనసాగుతుంది. మీరు మంచి మనిషి. మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు చేకూరాలి' అంటూ అర్ఫజ్‌కి ఇంటి పత్రాలు ఇస్తూ కులదీప్ కన్నీటిపర్యంత మయ్యారు. ఇంకా ఆయన ఇలా అన్నారు. 'చూడండి, ఆయన పిల్లలు ఆరుబయట ఎలా కూర్చున్నారో? ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు. దేశ పౌరులు అయినప్పటికీ వీరు నిరాశ్రయులయ్యారు' అని వాపోయారు. కులదీప్ శర్మ కుమార్తె తానియా మాట్లాడుతూ తండ్రి తీసుకున్న నిర్ణయం తమకు ఎంతో గర్వకారణమని చెప్పింది. 'నాకు చాలా బాధగా ఉంది. రాత్రికి రాత్రే అర్ఫజ్ ఇంటిని ఎలా కూల్చివేస్తారు? అతను నాకు సోదరుడి వంటి వాడు.

నేను మాత్రమే కాదు.. నా కుటుంబం, ఈ సమాజం మొత్తం ఆయనకు అండగా నిలుస్తుంది' అని తానియా చాలా గట్టిగా చెప్పింది. 2025 నవంబర్ 27న అర్ఫజ్ ఇంటిని కూల్చివేసిన తర్వాత వేలాది మంది ప్రజలు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. అర్ఫజ్ తండ్రి గులామ్ ఖాదిర్ ఆ సందర్భాన్ని ఇలా చెప్పారు. 'అధికారులు మా ఇంటిని కూల్చారు. మమ్మల్ని నిరాశ్రయులని చేశామని అనుకున్నారు. అయినా ప్రజలు మా పక్షాన నిలిచారు. నా కుమారుడికి మద్దతు ఇచ్చారు. ఇది నాకు ఎంతో విలువైనది. ఇంతకంటే నేను ఏం ఆశించగలను? ఇలాంటి ఉదంతాలు జమ్మూకాశ్మీర్‌లో ఇప్పటికీ మత సామరస్యం నెలకొని ఉన్నదని నిరూపిస్తున్నాయి.


నేను నిజంగా సంతోషిస్తున్నాను. అవినీతిపరులను, అక్రమంగా వ్యాపారాలు చేసే వారిని, భూములను కబ్జా చేసే వారిని ఎవరూ ప్రశ్నించరు. ఒకే అంతస్తుతో నిర్మించిన ఇంటిని జమ్మూ డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యంగా చేసుకుంది. నలభై సంవత్సరాల క్రితం దీనిని కట్టారు. మాకు వేరే ఇతర ఆస్తులేవీ లేవు. ఒకవేళ నా కుమారుడు నిజంగా అవినీతిపరుడై ఉంటే మా కోసం పెద్ద ఇంటినే కట్టి ఉండేవాడు' అని ఆయన ఆవేదనగా మాట్లాడారు. నేలమట్టమైన ఇంటి శిథిలాల వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టార్పాలిన్ గుడారంలో ప్రస్తుతం అర్ఫజ్ నివసిస్తున్నారు. కూలిపోయిన తన ఇంటి శిథిలాలు చూపిస్తూ.. 'చూడండి. ఈ దేశంలో అన్యాయాలు, అక్రమాలు చేసిన సాధువులు కూడా దర్జాగా బతుకుతున్నారు.

సత్యాన్ని చూపించిన జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు మాత్రం ఇలా బాధపడుతున్నారు' అని ఓ వీడియో పుటేజ్‌ని విడుదల చేశారు. గతంలో కూడా పోలీసులు అర్ఫజ్ ఇంటిని కూల్చేశారు. అప్పటి నుండి అతను తన తండ్రి ఇంట్లో తలదాచుకుంటున్నారు. ఇప్పుడు ఆ ఇంటిని కూడా కూల్చేశారు.

# రెండు దశల్లో 'జన గణన'

**- డిజిటల్ విధానంలో నిర్వహణ**

**- 2026 ఏప్రిల్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు : కేంద్రం**



న్యూఢిల్లీ : దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్టు కేంద్రప్రభుత్వం తెలిపింది. 2026 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన జరుగు తుందని లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వేసినప్రశ్నకు, హౌం వ్యవహారాల సహాయమంత్రి నిత్యానంద్ రారు సమాధానమిస్తూ జనగణన గురించి తెలిపారు. జనగణన మొదటి దశలో హౌస్ లిస్టింగ్, సెన్సెస్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. 'మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగు తుంది. అయితే ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యా నికి అనుగుణంగా 30రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని' నిత్యానంద్ రారు పేర్కొన్నారు. "2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్యలోరెండో దశజనగణన జరుగుతుంది. అయితేలద్దాక్, జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కప్పబడే నాన్-సింక్రోనస్ ప్రాంతాల్లో జనగణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 మధ్య జరుగుతుంది" అని నిత్యానంద్ రారు లోక్‌సభకు తెలిపారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్టు మంత్రి చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏండ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాల ఆధారంగా తదుపరి జన గణనకు పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు. డిజిటల్ విధానంలో: 2027 జనాభా లెక్కింపు డిజిటల్ వేలో నిర్వహించనున్నట్లు మంత్రి నిత్యానంద్ రారు పేర్కొన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కులగణన కూడా: మరో ప్రశ్నకు నిత్యానంద్ రారు సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగా కుల గణనను కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని ఆయన లోక్‌సభకు తెలిపారు.

# ఇక పెరిగేది ఎప్పుడూ?


**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** దేశంలో బీజేపీకి బలమైన నాయకత్వం ఉంది. మోదీ,అమిత్ షా వంటి వారు ఎప్పటికప్పుడు రాజకీయ వ్యూహా లను రచించుకుంటూ పార్టీని అన్ని రాష్ట్రాల్లో గెలుపు దిశగా తీసుకెళుతున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ మాత్రం మోదీ, అమిత్ షా చేతుల్లో లేదని వారికీ అర్థమయింది. ఇక్కడ రాష్ట్ర స్థాయి నేతలు ఎవరూ పెద్దగా పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేసేందుకు ప్రయత్నించరు. గత కొన్ని దశాబ్దాల నుంచి బీజేపీకి ఏపీలో పట్టు లేదు. ఒంటరిగా పోటీ చేస్తే సింగిల్ డిజిట్ ఓటింగ్ శాతానికి మాత్రమే పరిమితమవుతుంది. అందుకే టీడీపీ, జనసేన అండతోనే పార్లమెంటు స్థానాలయినా, అసెంబ్లీ సీట్లయినా గెలిచింది.

బీజేపీ నేతలు తమ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు ఇప్పటి నుంచి కాదు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కానీ, విభజన తర్వాత కానీ బీజేపీ ఏపీలో ఏదైనా బలపడిందా? అంటే లేదనే సమాధానమే వస్తుంది. పోనీ నాయకత్వం సరైనది లేదా? అంటే ఎందుకు లేరు.. ముప్పవరపు వెంకయ్య నాయుడు నుంచి కంభపాటి హరిబాబు,సోము వీర్రాజు, పురంద్రీశ్వరి.. నేడు మాధవ్ ఇలా రాజకీయాల్లో పట్టున్న వారే. కొంత జనాకర్షణ కలిగిన నేతలే. సామాజికవర్గం అండగా ఉన్న లీడర్లే. కానీ ఏ నియోజకవర్గంలోనూ ఒంటరిగా గెలిచేటంతగా పార్టీని తీసుకెళ్లలేకపోవడానికి కారణాలపై ఇంత వరకూ కమలం పార్టీలో అంతర్మథనం జరగలేదు. పొరుగున ఉన్న తెలంగాణలో ఒంటరిగా బీజేపీ బలపడుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ఇంత వరకూ ఒక్క పర్సెంట్ కూడా ఎదగలేదన్నది యదార్థం. దీనిపై కేంద్ర నాయకత్వం కూడా ఒకింత సీరియస్ గానే ఉందని తెలిసింది. కేంద్ర మంత్రి పదవులు, రాష్ట్రంలో మంత్రి పదవులు, గవర్నర్ గిరీ కట్టపెట్టినా ఏ మాత్రం ఫలితం ఎందుకు ఉండలేదని జాతీయ స్థాయి నాయకత్వంలో చర్చ ప్రారంభమయినట్లు తెలిసింది. ఎప్పటికీ ఇతరులపై ఆధారపడి ఎన్నేళ్లు రాజకీయాలు చేయాలన్న అసహనం కూడా అగ్రనాయకత్వం వ్యక్తం చేస్తున్నట్లు కనపడుతుంది. అందుకే బీజేపీ కేంద్ర నాయకత్వం ఏపీని తమ జాబితా నుంచి తొలగించినట్లేనని భావిస్తుంది. అలాగని పార్టీని పూర్తిగా వదిలేయడం మంచిది కాదని, త్వరలోనే కేంద్ర నాయకత్వం రాష్ట్ర నాయకులను పిలిచి క్లాస్ పీకే అవకాశాలు కూడా లేకపోలేదన్నది హస్తిన వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. మరి ఇప్పటికైనా బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో కదలిక వస్తుందా? లేదా? అన్నది చూడాలి.

# మళ్లీ సెంటిమంట?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ నేతలు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై విరుచుకుపడుతున్నారు. ఆయన క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ముందుగా బీఆర్ఎస్ నేతలు ఈ డిమాండ్ చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు దానిని కొనసాగిస్తున్నారు. తాజాగా తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పవన్ కళ్యాణ్ పై సంచలన ఆరోపణలు చేశారు. పవన్ క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకుంటే తెలంగాణలో ఆయన సినిమాలను ఆడనివ్వమని.. అనుమతి సైతం నిలిపివేస్తామని హెచ్చరించారు. అసలు పవన్ కళ్యాణ్ కు రాజకీయాలే తెలియని తేల్చేశారు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అయితే నిజంగా వెంకట్ రెడ్డి పవన్ కళ్యాణ్ పై కోపంతో ఈ వ్యాఖ్యలు చేశారా? లేకుంటే బి ఆర్ ఎస్ ఈ విషయంలో ముందంజలో ఉందని భావించి చేశారా? అన్నది తెలియాల్సి ఉంది. మొన్నటి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా ఒక వ్యాఖ్య ఆయన నోటి నుంచి వచ్చింది. అదే ఇంతటి వివాదానికి కారణం అయింది. యధాలపంగా వ్యాఖ్యలు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సముద్ర జలాలు మూలంగా కొబ్బరి తోటలు నాశనం అవుతున్నాయి. పచ్చటి తోటలు సైతం ఖాళీ అయి అంద విహీనంగా కనిపిస్తున్నాయి. స్థానిక రైతుల విన్నపం మేరకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ తోటలను పరిశీలించారు. ఈ క్రమంలోనే కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రాంతంలో కోనసీమ లాంటి అందమైన ప్రదేశం ఉండకపోవడంతో అక్కడి ప్రజలు ఎప్పుడూ బాధపడుతుంటారని.. ఆ దిష్టి తగిలినట్లు ఉందని అర్థం వచ్చేలా మాట్లాడారు. పవన్ కళ్యాణ్ సానుకూల దృక్పథంతోనే ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ పై ఎటువంటి వ్యతిరేక భావనతో వీటిని చేయలేదు. అయితే బిఆర్ఎస్ నేత జగదీశ్వర్ రెడ్డి అయితే పవన్ కళ్యాణ్ కు బుర్ర లేదు అంటూ సంచలన కామెంట్స్ చేశారు. అటు తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఒంటరిగా పోటీ చేయలేడు కానీ అంటూ వైసిపి ట్యాగ్ లైన్ తో మాట్లాడారు. ఇప్పుడేమో మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఏకంగా పవన్ కళ్యాణ్ సినిమాలపైనే మాట్లాడారు. క్షమాపణ చెప్పకపోతే తెలంగాణలో పవన్ కళ్యాణ్ సినిమాలు ఆడనివ్వబోమని హెచ్చరికలు పంపారు. ఆ ముగ్గురు ఎన్నిసార్లు క్షమాపణ చెప్పాలి? అయితే ఇప్పుడు పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెబుతారా? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ఎందుకంటే పవన్ వ్యతిరేక భావనతో ఆ వ్యాఖ్యలు చేయలేదు. కానీ తెలంగాణ నేతలు మాత్రం దానిని తప్పుపడుతున్నారు. అయితే అదే తెలంగాణకు సీఎం గా వ్యవహరించిన కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీష్ రావు అయితే ఏపీతోపాటు ఏపీ ప్రజలను, ఇక్కడి నేతలను ఉద్దేశించి కారుకూతలు కోశారు చాలా సందర్భాల్లో. ఈ లెక్కన వారితో ఎన్నిసార్లు క్షమాపణ చెప్పించాలి? అయితే ఇప్పుడు ఏకంగా తెలంగాణ మంత్రి స్పందించడంతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం ప్రారంభం కావడం ఖాయం. ఇప్పటివరకు పవన్ కళ్యాణ్ స్పందించలేదు. జనసేన నేతలు సైతం పెద్దగా రియాక్ట్ కావడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పవన్ కళ్యాణ్ కు కూటమి నేతలు కూడా అనుకున్న స్థాయిలో అండగా నిలబడడం లేదు. స్పందిస్తే సెంటిమెంట్ బయటకు.. కచ్చితంగా ఇప్పుడు ఏపీ నుంచి స్పందిస్తే మాత్రం మళ్లీ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించి రాజకీయంగా చలికాచుకోవాలని చూస్తోంది బిఆర్ఎస్ పార్టీ. అందుకే ఎందుకైనా మంచిది అని కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగింది. ఈ విషయంలో సెంటిమెంటు అస్త్రాన్ని కెసిఆర్ బయటకు తీస్తే మాత్రం.. అందులో తమ ప్రయోజనం పదిల పరుచుకోవాలని కాంగ్రెస్ భావించింది. అందుకే జగదీశ్వర్ రెడ్డి స్పందించిన తరువాత మాత్రమే ఎమ్మెల్యే తో పాటు మంత్రి స్పందించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. అయితే దీనిపై మౌనమే మేలని పవన్ కళ్యాణ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పైగా తెలంగాణ సమాజం తప్పు పట్టేలా మాత్రం పవన్ వ్యాఖ్యలు లేవు. ఆ వ్యాఖ్యల్లో ఉన్న ద్వందర్థాలతో రాజకీయం చేయాలని చూసింది బి ఆర్ఎస్. జాగ్రత్త పడింది కాంగ్రెస్.

# విశాఖలో మల్టీ లెవల్ పార్కింగ్..



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:** ఆసియా ఖండంలోవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటి. అటు అనకాపల్లి నుంచి ఇటు భోగాపురం వరకూ అన్ని ప్రాంతాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయి. అయితే విశాఖను మాత్రం ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. విశాఖలో పెరుగుతున్న జనాభాకు తోడుగా వాహనాల సంఖ్య పెరగటం, మౌలిక సదుపాయాలు కొరత దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. అలాగే విశాఖ పోర్టు ప్రాంతం కావటంతో.. పోర్టు, పారిశ్రామిక ప్రాంతాల వద్ద క్రేన్లు, భారీ ట్రక్కులు తిరుగుతూ ఉంటాయి. దీంతోనూ వాహనాల రాకపోకల కుఆటంకం కలుగుతూ ఉంటుంది. ఇరుకైన రహదారులు, జంక్షన్లు కూడా విశాఖలో ట్రాఫిక్ సమస్యకు కారణమనే వాదన ఉంది. సిగ్నల్ సమన్వయం లేకపోవటం తో పాటుగా రింగ్ రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణంలో జాప్యం కూడా కారణమేనన్న విమర్శలు ఉన్నాయి. ఇక విశాఖలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పోలీసులు అస్త్రం యాప్ వంటి టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నారు. కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణంపై అధికారులు ఫోకస్ పెట్టారు. అయితే విశాఖవాసులను ట్రాఫిక్ సమస్యలతో పాటు మరో సమస్య కూడా వేధిస్తోంది. అదే పార్కింగ్ సమస్య. సరైన పార్కింగ్ సదుపాయాలు లేక చాలాచోట్ల వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారు. ముఖ్యంగా జగదాంబ జంక్షన్, విశాఖ కేజీహెచ్, విశాఖ కలెక్టరేట్లతో పాటుగా ఇతర గవర్నమెంట్ ఆఫీసుల వద్ద కూడా పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే ఈ సమస్యకు ప్రస్తుతం కాస్త ఉపశమనం కలిగిందనే చెప్పొచ్చు. పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రూ. 11 కోట్లతో జగదాంబ జంక్షన్ వద్ద మల్టీలెవల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇది అందుబాటులోకి వచ్చింది.

ఈ మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌ను ఐదు అంతస్తులతో ఏర్పాటు చేశారు. ఇనుప గ్రిల్స్‌తో తయారు చేసి, వాహనాల పార్కింగ్ కోసం హైడ్రాలిక్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ కార్యాల యంవద్ద కూడా ఇదే తరహాలో మల్టీ లెవల్ కారుపార్కింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌లో వాహనానికి గంటకు 40 రూపాయలు వసూలు చేస్తున్నారు. మొదటి గంటను 40 రూపాయ లు.. ఆ తర్వాతి నుంచిప్రతి గంటకూ 20రూపా యలుచొప్పున అద్దె నిర్ణయించారు. వాహనదారుల సౌలభ్యం కోసం 3 వేల 500 రూపా యలతో నెలవారీ పార్కింగ్ పాస్ కూడా అందుబాటులోకి తెచ్చారు.

# అంతుపట్టని వ్యూహం



**కాకినాడ,తెలంగాణ దిశ :**పవన్ కళ్యాణ్ ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తున్నారు. అది స్పష్టంగా తెలుస్తుంది కూడా. ఒకవైపు తన శాఖల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల విధ్వంసాలను బయటకు తెస్తున్నారు. ఏకకాలంలో అభివృద్ధి, వైసిపి వైఫల్యాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తున్నారు. మొన్న మధ్యన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల ఆక్రమణ వ్యవహారం పవన్ బయట పెట్టిన తర్వాత ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. తాజాగా పల్లె పండుగ 2.0 ప్రారంభం కావడంతో పల్లెల్లో సందడి నెలకొంది. ఏకకాలంలో పవన్ వ్యూహం తెలియక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సతమతం అవుతోంది. పవన్ విషయంలో ఎలా ముందుకెళ్లాలో తెలియక మల్లగుల్లాలు పడుతోంది. పవన్ వ్యూహాత్మక శైలి విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తుంది. కూటమి సమన్వయంతో ముందుకు సాగుతోంది. సీఎం చంద్రబాబు పాలనపై పూర్తిగా దృష్టిపెట్టారు. లోకేష్ విదేశీ పెట్టుబడులపై ఫోకస్ చేశారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెస్తున్నారు.

వాటి జోలికి పవన్ కళ్యాణ్ పోవడం లేదు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి సంబంధించి పవన్ కళ్యాణ్ పూర్తి స్వేచ్ఛ తో పనిచేస్తున్నారు. అటవీ శాఖతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై పవన్ తనదైన శైలిలో ముందుకు వెళుతున్నారు.

అంటే కచ్చితంగా దీని వెనుక వ్యూహం ఉంటుంది. వ్యూహం ప్రకారమే ఆ ముగ్గురు నేతలు ముందుకెళ్తున్నారు. రాజకీయంగా అవసరమైన ప్రతిసారి పవన్ వచ్చి బయట మాట్లాడుతున్నారు. అందులో భాగంగా పెద్దిరెడ్డి లాంటి పెద్ద నేత విషయంలో పవన్ చెప్పేసరికి ప్రజల్లోకి వెళ్ళింది. అదే చంద్రబాబు చెబితే దశాబ్దాల వైరం వారి మధ్య ఉండడంతో కావాలనే చెప్పారని ప్రత్యర్థులు ఆరోపించేవారు.మరో 15 ఏళ్ల పాటు ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంటుందని పవన్ కళ్యాణ్ పదేపదే చెబుతున్నారు.

ఆ మాట వెనుక ఉన్న మర్మం ఏమిటో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెలియడం లేదు. 15 ఏళ్ల పాటు చంద్రబాబు సీఎం గా కొనసాగుతారా? లేకుంటే పవన్ పదవి చేపడతారా? అనేది తెలియక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్ఫ్యూజన్లో ఉంది. మరో విడత చంద్రబాబు పదవి చేపట్టేందుకు డోకా లేదు. ఆ తరువాత ఆయన ఆరోగ్యంతో పాటు వయసు సహకరిస్తుందా లేదా అన్నది ఒక అనుమానం. మరోవైపు పవన్ విషయంలో టిడిపి అనుకూల మీడియా వైఖరి సైతం మారడం లేదు. అలాగని పతాక స్థాయిలో ప్రచారం కల్పించడం లేదు.

అసలు కూటమిలో ఏం జరుగుతుందని అనుమానం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెంటాడుతూనే ఉంది. ఆపై గుట్టు ఆముగ్గురు నేతలమధ్య ఉంది.అస్మదీయులకు ప్రయోగిస్తామంటే కుదరని పని కూడా. కూటమి వ్యూహం తెలియక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పడుతున్న బాధ అంతా ఇంతా కాదు కూడా. అయితే ప్రధానంగా డిప్యూటీ సీఎం పవన్ వ్యూహం తెలియక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు నిద్ర కూడా పట్టడంలేదు.

# నెంబర్ వన్ గా జియో

ముంబై: దేశీయ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోయింది. లక్షలాది మంది కొత్త కస్టమర్లను చేర్చుకుంది. అక్టోబర్ నెలలో జియోకు కొత్తగా 19.97 లక్షల మంది చేరినట్లు ట్రాయ్ వెల్లడించింది. దీంతో కంపెనీ మొబైల్ కస్టమర్లు 48.47 కోట్లకు చేరుకున్నారు. అలాగే ఎయిర్‌టెల్ వైర్‌లెస్ యూజర్లు 12.52 లక్షల మంది చేరడంతో మొత్తం సంఖ్య 39.36 కోట్లకు చేరుకున్నారు. ట్రాయ్ వివరాల ప్రకారం.. అంతకు ముందు నెలలో 39.24 లక్షల మంది ఉన్నారు. ఇక ప్రభుత్వరంగ టెలికాం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు 9.25 కోట్లకు చేరారు. కానీ, వొడాఫోన్ ఐడియాకు మరోసారి భారీ షాక్ తగిలింది. గత నెలలోనూ కంపెనీ నెట్‌వర్క్ నుంచి 20.83 లక్షల మంది వెళ్లిపోయారు. దీంతో కంపెనీ మొబైల్ యూజర్లు 20 కోట్లకు పడిపోయినట్టు ట్రాయ్ తన నెలవారి సమీక్షలో వెల్లడించింది. మొత్తంమీద దేశీయంగా 123 కోట్ల మంది టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు ఉన్నట్టు ట్రాయ్ తెలిపింది.మొత్తం బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య సెప్టెంబర్ చివరి నాటికి 995.63 మిలియన్ల నుండి అక్టోబర్ చివరి నాటికి 999.81 మిలియన్లకు పెరిగింది.నెలవారీ వృద్ధి రేటు0.42 శాతం. ఆర్జియె 50.84 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ 31.26 శాతం,విఐ 12.72 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి.2025 సెప్టెంబర్ చివరి నాటికి 46.61 మిలియన్లుగా ఉన్న వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 2025 అక్టోబర్ చివరి నాటికి 46.75 మిలియన్లకు పెరిగింది. వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ బేస్‌లో నికర పెరుగుదల




0.14మిలియన్లు, నెలవారీ వృద్ధి రేటు 0.30 శాతం. అక్టోబర్ 2025లో వైర్‌లైన్ మార్కెట్‌లో రిలయన్స్ జియో 30.75 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 22.86 శాతం, వొడాఫోన్ ఐడియా 1.74 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మూడు పిఎస్యూ యాక్సెస్ సర్వీస్ ప్రొవైడర్లు అయిన బీఎస్ఎన్ఎల్ , ఎంటీఎన్ఎల్, ంఖూఈఒ వైర్‌లైన్ మార్కెట్ వాటాలో20.22% శాతం వాటాను కలిగి ఉన్నాయి.2025 సెప్టెంబర్1,182.32 నాటికి వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య1182.32 మిలియన్ల నుండి 2025 అక్టోబర్ చివరి నాటికి 1184.62 మిలియన్లకు పెరిగింది. తద్వారా నెలవారీ వృద్ధి రేటు 0.19 శాతంగా నమోదైంది. 2025 అక్టోబర్‌లో వైర్‌లైన్ మార్కెట్‌లో రిలయన్స్ జియో 41.36 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 33.59 శాతం, వొడాఫోన్ ఐడియా 17.13 శాతం వాటాను కలిగి ఉన్నాయి. రెండు పిఎస్యూ యాక్సెస్ సర్వీస్ ప్రొవైడర్లు అయిన బీఎస్ఎన్ఎల్,ఎంటీఎన్ఎల్ మార్కెట్ వాటా కేవలం 7.92 శాతం మాత్రమే.

# కన్నవాళ్లు వదిలేస్తే.. వీధి కుక్కలు కాపాడాయి



ప్రస్తుతం చిన్నారులపై కుక్కలు విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వార్తలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న సమయంలో.. అప్పుడే పుట్టిన చిన్నారికి వీధి కుక్కలే రక్షణగా మారిన ఘటన వైరల్‌గా మారింది. ఓ నవజాత శిశువును కన్నవారు రోడ్డుపై వదిలేస్తే.. చిన్నారికి వీధి కుక్కలు రక్షణగా నిలిచిన ఘటన పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లాలో వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నదియా జిల్లాలోని రైల్వేవర్కర్స్ కాలనీలో ఓ బాత్‌రూమ్ ఎదుట అప్పుడే పుట్టిన పసికందును తల్లిదండ్రులు బుధవారం తెల్లవారుజామున వదిలేసి వెళ్లారు. దుప్పటిలో చుట్టి ఉన్న ఆ పసికందు చుట్టూ వీధి కుక్కలు చేరి.. ఉదయం వరకు చిన్నారికి రక్షణగా ఉన్నాయి. తెల్లవారిన తర్వాత కుక్కల మధ్యలో చిన్నారి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే ఆ పసికందును ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పసికందుపై కుక్కలు వ్యవహరించిన తీరును స్థానికులు ప్రశంసిస్తున్నారు. చిన్నారి చుట్టూ చేరిన కుక్కలు చలిలో కొన్ని గంటల పాటు.. పసికందుకు కాపలాగా నిలబడే ఉన్నట్లు పేర్కొన్నారు. చిన్నారిని ఆస్పత్రికి తరలించడానికి వెళ్లినప్పుడు ముందు ఎవరినీ దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. అనంతరం పొరుగువారి సాయంతో శిశువును మహేశ్‌గంజ్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని.. చిన్నారిని ఎవరు వదిలివెళ్లారనే విషయం తెలుసుకోవడానికి స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# అడ్డూ అదుపులేని వెండి ధరలు!

**వేలల్లో పెరుగుతూ బంగారానికి సవాల్**

**రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిక**

న్యూఢిల్లీ: వెండిధరలు అదరగొడుతున్నాయి. బంగారం తో నాకేంటి పోటీ అన్నట్లుగా అమాంతంగా పెరుగుతున్నాయి. పెరగడమే తప్ప తగ్గడం లేదు. సరిగ్గా ఏడాది క్రితం వెండి ధర కిలో తొలిసారి లక్ష రూపాయలు దాటితే అంతా అబ్బో అనుకున్నారు. కానీ, ఇప్పుడు అదే వెండి పసిడికి ఏమాత్రం తక్కువ కానంటోంది. పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతోంది. దేశీయంగా కిలో వెండి రూ.1.84 లక్షల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. అటు పసిడి సైతం రూ.1.30 లక్షల పైనే పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడానికి తోడు, రూపాయి విలువ పతనం కావడమూ ఈ లోహాల ధరల పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. వెండి అత్యధికంగా రూ.3,126 పెరిగి రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువ 90 మార్కు దాటింది. దీంతో దేశీయంగా వీటి ధరలు పెరిగాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,204 వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 57.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.83 లక్షలుగా ఉంది. గతంలో దేవుళ్ల బొమ్మలు, పూజా సామగ్రి, సంపన్నుల ఇళ్లల్లో పళ్లాలు, గ్లాసులకు వెండిని దేశీయంగా వినియోగించేవారు. కొవిడ్ తర్వాత పరిస్థితులు మారాయి. పారిశ్రామికంగా వెండి వినియోగం పెరిగింది. సౌర విద్యుత్ రంగం, విద్యుత్ కార్లు, మొబైల్స్ తదితర



రంగాల నుంచి దీనికి డిమాండ్ పెరిగింది. దీనికితోడు చిన్న మదుపరులు పెట్టుబడి కోసం వెండిని కొనడం ప్రారంభించారు. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి బంగారంతో పాటు వెండికీ ఉందని చెబుతుండటంతో, మదుపరుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు.



# మరింతగా క్షీణించిన రూపాయి

ముంబై: యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం ట్రేడింగ్‌లో 6 పైసలు తగ్గి చరిత్రలో తొలిసారిగా 90.02కి చేరుకుంది. గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి, రికార్డు స్థాయిలో 90.15కి చేరుకుంది. తరువాత కొంత కోలుకుని 90.02 వద్ద ట్రేడవుతోంది. ఇది దాని మునుపటి ముగింపు కంటే 6 పైసలు తగ్గింది. బ్యాంకులు అధిక స్థాయిలో యుఎస్ డాలర్లను నిరంతరం కొనుగోలు చేయడం, ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు కొనసాగడం దీనికి కారణమని చెబుతున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో, సెన్సెక్స్ 165.35 పాయింట్లు తగ్గి 84,972.92కు, నిఫ్టీ 77.85 పాయింట్లు తగ్గి 25,954.35కు చేరుకుంది. రూపాయి క్షీణత అకస్మాత్తుగా సంభవించలేదు. ఇది 2025 అంతటా క్రమంగా తగ్గుతూ వచ్చింది. అప్పుడప్పుడు తిరిగి పుంజుకునే సంకేతాలు వచ్చినప్పటికీ కొనసాగలేకపోయింది. 2025 ప్రారంభంలో రూపాయి బలహీనపడటం ప్రారంభమైంది.

2025 జనవరి మధ్య నాటికి, రూ.86.70కి పడిపోయింది. మార్చి 10న 30 పైసలు తగ్గి సుమారు రూ.87.25కి చేరుకుంది. సెప్టెంబర్‌లో ఇది ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది. దాదాపు రూ.88.79కి చేరుకుంది. నవంబర్ 21న రూ.89.49కి పడిపోయింది. నవంబర్ చివరిలో ఇది కోలుకునే సంకేతాలను చూపించింది. కొన్ని రోజుల్లో రూపాయి రూ.89.26- రూ.89.28 మధ్య ట్రేడవుతూ నిలిచింది. కానీ దీనిని నిలబెట్టుకోలేకపోయింది. డిసెంబర్ నాటికి ఇది 90 దాటి దిగువకు పడిపోయింది.



# ప్రైవేట్ రంగంలో న్యూక్లియర్ ఎనర్జీ..

న్యూక్లియర్ ఎనర్జీ.. వినియోగించే తీరుపై దీని పవర్ ఆధారపడి ఉంటుంది. విధ్వంసానికి వాడితే ప్రపంచం నాశనం అవుతుంది. సద్వినియోగం చేసుకుంటే అనేక దేశాలు అభివృద్ధి చెందుతాయి. యురేనియంతో ఉత్పత్తి చేసే పవర్‌తో విద్యుత్ ధరలు చాలా వరకు తగ్గుతాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీ ఇటీవల ప్రైవేటు సంస్థలుకు న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తిలో భాగస్వామ్యం అందించే నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 8?10 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న భారత్ రాబోయే కాలంలో 100 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇది విద్యుత్ బిల్లులు 5,000 నుంచి 500 రూపాయల వరకు తగ్గే అవకాశాన్ని కలిగిస్తుంది.ప్రపంచంలో న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తిలో చైనా మొదటి, అమెరికా రెండో స్థానంలో ఉండగా, భారత్ మూడో స్థానంలో నిలిచింది. యురేనియం సమృద్ధితో, భారత్ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఈ శక్తిని మరింత విశాలపరిచే అవకాశాలు ఉన్నాయి. అమెరికా, కెనడా వంటి దేశాల సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెడితే స్థాయి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.ప్రైవేటీకరణతో న్యూక్లియర్ ఉత్పత్తి పెరిగితే విద్యుత్ తీవ్రంగా సరఫరా అవ్వడం వల్ల పాకిస్తాన్ కు భయాందోళనలు ఏర్పడతాయని నిపుణులు భావిస్తున్నారు.

అణు విద్యుత్తుకు అవసరమైన యురేనియం ను తవ్వడానికి, దిగుమతి చేసుకోవడానికి, ప్రాసెస్ చేయడానికి ప్రైవేట్ సంస్థలను అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. 2047 నాటికి అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 12 రెట్లు పెంచాలని యోచిస్తోంది. అలా జరిగితే భారతదేశ మొత్తం విద్యుత్ అవసరాలలో 5% అణు విద్యుత్తు ద్వారా తీరుతుంది. అణు విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన నియంత్రణ వ్యవస్థ పరికరాలను సరఫరా చేయడానికి ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పిస్తారట.ప్రభుత్వ డేటా ప్రకారం.. భారతదేశంలో 76, 000 టన్నుల యురేనియం ఉందని అంచనా. ఇది 30 సంవత్సరాల పాటు 10,000 మెగావాట్ల అణు విద్యుత్తుకు ఇంధనంగా సరిపోతుంది. ఈ నేపథ్యంలో భారతదేశం తన ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. ఇంధన విషయంలో దేశం ఎంతో ప్రగతి సాధించాలి. సోలార్, గ్రీన్ హైడ్రోజన్ వైపు నడవాల్సి ఉంది. అణు ఇంధనంపై కూడా దృష్టి సారించి వేగంగా అడుగులు వేయాలి.

అణు విద్యుత్తులో ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానిస్తాం. పెట్రోల్, డీజిల్ దిగుమతుల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. కొత్త ఇంధనాల సహాయంతో దిగుమతులను తగ్గించుకోవచ్చు. ఆ దిగుమతులు తగ్గితే స్వయం సమృద్ధి సాధ్యమవుతుంది. నేడు ప్రపంచమంతా ఖనిజాల గురించే ఆలోచిస్తోంది' అని తాజాగా ప్రధాని వ్యాఖ్యానించారు.బడ్జెట్‌లో ఎక్కువ భాగం ఇప్పటికీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ దిగుమతి చేసుకోవడానికే పోతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. సౌర, హైడ్రోజన్, జల, అణుశక్తిలో ప్రధాన విస్తరణలతో పాటు సముద్ర వనరులను ఉపయోగించుకునేందుకు నేషనల్ డీప్ వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్‌నూ ప్రారంభించనట్లు ఆయన ప్రకటించారు.భారత్‌లో అణు విద్యుత్, ఇతర న్యూక్లియర్ పరిశోధనలు పూర్తిగా ప్రభుత్వరంగంలోనే కొనసాగుతున్నాయి. 'అటామిక్ ఎనర్జీ యాక్ట్ -1962' ద్వారా ఈ రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ చట్టం స్థానంలో మోదీ సర్కారు కొత్త చట్టం తీసుకొచ్చి ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించాలని నిర్ణయించింది.

అందుకోసం డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 'ది అటామిక్ ఎనర్జీ బిల్-2025'ను ప్రవేశపెట్టబోతోంది. అణు విద్యుత్ విభాగంలో ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించేలా 2025-26 వార్షిక బడ్జెట్‌లోనే నిర్ణయం తీసుకున్నట్లు గత ఆగస్టులో అణు ఇంధన విభాగం వెల్లడించింది. 'సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్-2010' (సీఎల్ఎన్‌డీ)కి కూడా సవరణలు చేయనున్నారు. ప్రస్తుతం మనదేశంలో ప్రస్తుతం అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 8,880 మెగావాట్లు ఉంది.

దీనిని 2031-32 నాటికి 22,480 మెగావాట్లకు పెంచాలని నిర్ణయించారు. 2070 నాటికి పూర్తిగా కాలుష్యరహిత మార్గాల ద్వారానే (నెట్ జీరో) విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఇంతకుముందు న్యూక్లియర్ భూగర్భ సాంకేతికతపై భారత్ పెరిగిన అసలు శక్తిని చూసి చైనా కూడా ఈ వ్యూహంతో ఇబ్బంది పడుతుందని అంచనా. ఈ కొత్త ప్రణాళిక భారత్‌కు భద్రత, ఆర్థిక వృద్ధికి విప్లవాత్మక మార్గదర్శకంగా నిలుస్తుంది.

## 13 మంది కుటుం సభ్యులను కాల్చివేత

**హంతకుడికి బహిరంగ మరణం**

**బాలుడితో కాల్చి చంపించిన అఫ్ఘాన్ పోలీసులు**

కాబూల్: తాలిబాన్ పాలిత అఫ్ఘానిస్తాన్‌లోని కోస్ట్ ప్రాంతంలో ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఒక హంతకుడికి బహిరంగ శిక్ష అమలు చేయడంలో షాకింగ్ పనిచేశారు ఆఫ్ఘాన్ పోలీసులు. ఒకే ఫ్యామిలీకి చెందిన 13 మందిని దారుణంగా హత్య చేసిన నిందితుడు మంగల్‌ను, 13 ఏళ్ల బాలుడు చేత కాల్చి చంపించారు. శిక్షను స్థానిక స్పోర్ట్స్ స్టేడియంలో 80 వేల మంది ప్రజల ముందు అమలు చేశారు. అఫ్ఘాన్ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ 'ఖిసాస్' అంటే ప్రతీకార శిక్ష జరిగింది.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, మంగల్ 10 నెలల క్రితం అలీ షిర్ టెరెజియో జిల్లాల్లో నివశించే అబ్దుల్ రహ్మాన్.. అతని కుటుంబంలోని 12 మందిని తుపాకీతో కాల్చి చంపాడు.ఈ హత్యలకు అతనికి జీవిత ఖైదు శిక్ష పడింది. శిక్ష అమలు సమయంలో తాలిబాన్ అధికారులు కుటుంబంలో బతికున్న బాలుడు అబ్దుల్ రహ్మాన్ మంగల్‌కు క్షమాభిక్ష పెడతావా అని అడిగారు..

కానీ బాలుడు నిరాకరించడంతో, అతనికి తుపాకీ ఇచ్చి మంగల్‌పై మూడు రౌండ్ల కాల్పులు జరిపించారు. ఈ సందర్భంగా స్టేడియం భిద్దు 'అల్లాహు అక్బర్' నినాదాలతో దద్ధరిల్లింది.

కోస్ట్ పోలీస్ ప్రతినిధి ఈ ఘటనను ధృవీకరించారు. తాలిబాన్ పాలితంలోషరియా చట్టం కింద ఇలాంటి బహిరంగ శిక్షలు పెరుగుతున్నాయి. అయితే, అంతర్జాతీయ సమాజం ఈ శిక్షను 'అమానవీయమైనది, అత్యంత క్రూరమైనది' అని ఖండిస్తోంది.

# సినిమా..

## 100 రోజుల ముందు ట్రైలర్..



పోస్టర్ మీద నాలుగైదు భాషల్లో రిలీజ్ అంటూ ఘనంగా ప్రకటించుకునేవాళ్లే కానీ.. పాన్ ఇండియా స్థాయిలో సరిగ్గా సినిమాను ప్రమోట్ చేసి రిలీజ్ చేసేవాళ్లు తక్కువ. పాన్ ఇండియా స్థాయిలో సినిమా ప్రభావం చూపాలంటే ముందుగా షూటింగ్ పూర్తి చేయడం, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా పర్ఫెక్ట్‌గా జరగడం.. ఇతర భాషల్లో డబ్బింగ్ సరిగ్గా ఉండడం.. దేశవ్యాప్తంగా ప్రమోషన్లు బాగా చేయడం చాలా అవసరం. కానీ ఈ ప్లానింగ్ అన్ని సినిమాలకూ పర్ఫెక్ట్‌గా జరగదు.పవన్ కళ్యాణ్ సినిమా 'ఓజీ' సైతం పాన్ ఇండియా మూవీనే. కానీ ఇతర భాషల్లో నామమాత్ర ంగా రిలీజైంది. ఐతే ప్రభాస్ సినిమా 'రాజా సాబ్' విషయంలో మాత్రం టీం పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో రంగంలోకి దిగుతోంది. ప్రభాస్‌కు మిగతా ఏ ఇండియన్ స్టార్‌కూ లేని స్థాయిలో దేశవ్యాప్తంగా ఫాలోయింగ్, మార్కెట్ ఉన్న మాట వాస్తవం. దాన్ని పూర్తిగా ఉపయోగించుకునేలా 'రాజా సాబ్' టీం అడుగులు వేస్తోంది. 'రాజా సాబ్' చిత్రీకరణ పూర్తి కావచ్చింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా చివరి దశలో ఉన్నాయి. ప్రమోషన్లు కూడా గట్టిగా చేసేలా ఉన్నారు. సినిమా రిలీజ్‌కు ఏకంగా 100 రోజుల ముందే దీని ట్రైలర్‌ను లాంచ్ చేస్తుండడం విశేషం. ఈ సోమవారం సాయంత్రమే ట్రైలర్ వస్తోంది. 'రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. సరిగ్గా వంద రోజుల గ్యాప్ పెట్టుకుని ఇప్పుడే ట్రైలర్ లాంచ్ చేస్తున్నారు. బహుశా పాన్ ఇండియా సినిమాల్లో ఇంత ముందుగా ట్రైలర్ లాంచ్ అవుతున్న సినిమ ఇదే కావచ్చు. రిలీజ్ డేట్ ఖరారైపోవడంతో ఇప్పట్నుంచే విడుదలకు కౌంట్‌డౌన్ మొదలవుతుంది. ట్రైలర్ బాగుంటే పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులు సినిమా కోసం ఎదురు చూస్తారు. తర్వాత రెగ్యులర్‌గా ప్రమోషనల్ కంటెంట్ వదులుతూ.. దేశవ్యాప్తంగా ఈవెంట్లు చేస్తూ హైప్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేయనుంది టీం. ముందు ట్రైలర్ లాంచ్ చేసి తర్వాత పాటలు, ఇతర కంటెంట్ వదలడం అరుదైన విషయమే. ఎలాగూ విడుదల దగ్గర్లో రిలీజ్ ట్రైలర్ అంటూ ఇంకో ప్రోమో వదులుతారు. చూస్తుంటే 'రాజా సాబ్' రిలీజ్ టైంకి హైప్ వేరే లెవెల్‌కు వెళ్లేలాగే కనిపిస్తోంది.

## కలలోనూ ఊహించలేదు.. : రుక్మిణీ



రుక్మిణీ వసంత్.. నిన్న మొన్నటి వరకు కన్నడ సినీ ఇండస్ట్రీలో ఈ పేరుపుల్ గా వినిపించింది. అక్కడ తీసిన సప్త సాగరాలు దాటి సిరీస్ చిత్రాలతోపాటు బఘీర వంటి సినిమాలతో ఆమె మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు. ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ లో కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. పలు సినిమాల్లో నటిస్తున్నారు. రీసెంట్ గా కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ లీడ్ రోల్ లో తెరకెక్కిన మదరాసితో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన రుక్మిణీ.. తన యాక్టింగ్‌తో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు అక్టోబర్ 2వ తేదీన కాంతార చాప్టర్ 1తో సందడి చేయనున్న అమ్మడు.. తాజాగా ఇచ్చిన ఓఇంటర్వ్యూలో పలు విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముందుగా కాంతార ప్రీక్వెల్ మూవీ ఛాన్స్ కోసం మాట్లాడారు. తాను నటించిన సప్తసాగరాలు దాటి, ఏస్ మూవీలను రిషబ్ శెట్టి చూశారని, ప్రీమియర్స్ కు వచ్చి తన నటనను మెచ్చుకున్నారని తెలిపారు. కాంతార చాప్టర్ 1లో యాక్ట్ చేసే అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని చెప్పుకొచ్చారు రుక్మిణీ వసంత్. ఆయన తన సినిమాల ప్రీమియర్స్ చూసి ఛాన్స్ ఇచ్చారని భావిస్తున్నట్లు చెప్పారు. కాంతార టీమ్ తన ఫోన్ చేసి ఇందులో యాక్ట్ చేస్తారా అని అడిగినప్పుడు అప్పుడు వచ్చిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేనని తెలిపారు. కాంతార ప్రీక్వెల్ 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ అని, అప్పటి పరిస్థితులకు తగినట్లు నటించాలని రుక్మిణీ వసంత్ చెప్పారు.

## ఎంత హైటున్న హీరో అయినా ఒకే!



టాలీవుడ్ కి పరిచయమైన యంగ్ బ్యూటీ ఇవానా గురించి చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే అమ్మడు యువత అటెన్షన్ డ్రా చేసింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీ తో కుర్రకారులో క్రేజీ బ్యూటీగా మారిపో యింది. వైవిధ్యమైన హావభావాలతో ప్రేక్షకులకు దగ్గరైంది. ఇటీవలే సింగిల్ తో తెలుగులోనూ లాంచ్ అయింది. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. కేతిక పాత్ర కంటే ఇవానా పాత్రకే మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో ఓ ఛాన్స్ అందు కుందనే ప్రచారం జరుగుతోంది. సక్సెస్ పరంగా ఇవానా ట్రాక్ బాగుంది. కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ పాజిటివ్ గానే కనిపి స్తుంది. యూత్ లోనూ క్రేజీ బ్యూటీ గా వైరల్ అవుతోంది. -సింగిల్- తర్వాత తెలుగులో ఫాలోయింగ్ రెట్టింపు అయింది. ఇక ఇవానా వయసు విషయానికి వస్తే అమ్మడికి 25 ఏళ్లు. అంటే స్టార్ హీరోలందరితో నటించే వయసే. 20 ఏళ్ల నటే 50-40 ఏళ్ల వయసున్న హీరోలతో రొమాన్స్ చేస్తున్నారు.

## రీఎంట్రీ బాలయ్య సినిమాతోనే?



ఎన్టీఆర్ బయోపిక్స్ కథానాయకుడు, మహానాయకుడు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరవయ్యారు బాలీవుడ్ నటి విద్యాబాలన్. ఆ చిత్రాల్లో ఆమె ఎన్టీఆర్ సతీమణి బసవతారం పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ తెలుగు తెరపై విద్యాబాలన్ కనిపించలేదు. అయితే.. మళ్లీ ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారనేది లేటెస్ట్ న్యూస్. అది కూడా బాలయ్య సినిమాతోనేనట. ప్రస్తుతం బ్లాక్‌బస్టర్ 'అఖండ' సీక్వెల్ 'అఖండ – తాండవం' షూటింగ్‌లో బాలయ్య బిజీగా ఉన్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో విద్యాబాలన్ ఓ కీలక పాత్ర పోషించనున్నారట. ఇందులో కథ రీత్యా ఓ పవర్‌ఫుల్ పొలిటికల్ లీడర్ పాత్ర ఉందట. ఆ పాత్రకోసం విద్యాబాలన్‌ని బోయపాటి సంప్రదించారనీ, కథ, పాత్ర విన్న తర్వాత ఆమె చేయడానికి అంగీకరించారని సమాచారం.

## ఏ వైపు మంచిది?



చక్కటి ఆరోగ్యానికి చిక్కటి నిద్ర ఎంతో అవసరం. లేకుంటే.. అనారోగ్యాల పాలవ్వడం ఖాయం! ఈ విషయంలో నిద్ర ఒక్కటే కాదు.. నిద్రపోయే భంగిమ కూడా ఎంతో కీలకం. అందులోనూ ఎడమవైపు తిరిగి పడుకుంటే.. ఎంతో ప్రయోజనకరం.

రకరకాల మనుషులు.. రకరకాలుగా నిద్రిస్తుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే.. మరికొందరు బోర్లా పడుకుంటారు. కొందరు కుడివైపు వాలితే.. ఇంకొందరు ఎడమవైపునకు ఒరుగుతుంటారు. వీటన్నిట్లోకి.. ఎడమవైపు తిరిగి పడుకోవడమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు నిపుణులు.

ఇలా పడుకోవడం వల్ల భవిష్యత్తులోనూ ఆరోగ్య సమస్యలు తలెత్త కుండా ఉంటాయని చెబుతున్నారు. ఎడమవైపు తిరిగి పడుకోవడం గుండెకు ఎంతో మేలుచేస్తుంది. గుండె ఎడమ వైపునే ఉంటుంది కాబట్టి, అదే దిశలో పడుకుంటే గురుత్వాకర్షణ వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేకుండా గుండెకు రక్త సరఫరా అవుతుంది. ఫలితంగా గుండెపై ఒత్తిడి తగ్గిపోతుంది.

గురక సమస్య తగ్గాలంటే.. ఎడమవైపు తిరిగి పడుకోండి. శ్వాస తీసుకోవడం కూడా సులభం అవుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాగా, మిగిలిన వ్యర్థాలు, టాక్సిన్లన్నీ పేగుల్లోనే ఉండిపోతాయి. కుడివైపు కన్నా ఎడమవైపు తిరిగి పడుకున్నప్పుడే.. అవన్నీ సులభంగా కిందికి వెళ్లిపోతాయి.

ఇక ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల.. వీపు, నడుము, వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది. ముఖ్యంగా.. గర్భిణులు ఇలా పడుకోవడం వల్ల పిండానికి రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఆరోగ్యానికి ఎంత మంచిదైనా..

ఎప్పుడూ ఒకే వైపు తిరిగి పడుకోలేం. అందుకే కాసేపు కుడివైపు, వెల్లకిలా పడుకున్నా.. వీలైనంత ఎక్కువ సమయం ఎడమ వైపు తిరిగి పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## అరిగిన కీళ్లకు కణాలతో వైద్యం



మోకాళ్ల నొప్పులు వృద్ధాప్య సమస్యల్లో ఒకటిగా చెప్పుకొనేవారు. అదంతా ఒకప్పుడు. ఇప్పుడు నలభై ఏళ్లకే మోకాళ్లే కాదు ఇతర కీళ్లలోనూ నొప్పులతో తిప్పలు పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఈ సమస్యకు సకాలంలో చికిత్స చేయకపోతే శస్త్ర చికిత్స చేయాల్సిందే. ప్రారంభంలోనే పీఆర్‌పీ థెరపీతో కీళ్ల నొప్పులకు చెక్ పెట్టొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ కీళ్ల నొప్పులకు కారణాలు ఏమిటి? నొప్పికి ముందే వాటిని ఎలా గుర్తించాలి? ఆపరేషన్ లేకుండానే పీఆర్‌పీ థెరపీతో ఎలా నివారించవచ్చో నేటి ఊపిరిలో తెలుసుకుందాం. కీళ్ల నొప్పులు వయసుతో సంబంధం ఉన్న వ్యాధుల్లో ఒకటిగా వైద్యులు గుర్తించారు. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో మార్పులతో కీళ్ల నొప్పులకూ వయోసడలింపు వచ్చేసింది. అరవైకి ఇరవై ఏళ్ల ముందే మోకాళ్ల నొప్పులు బాధిస్తున్న వారు నానాటికీ పెరుగుతున్నారు. మోకీళ్లే కాదు భుజం నొప్పి, వెన్నునొప్పి, తుంటి నొప్పి ఇలా శరీరంలోని కీళ్ల నొప్పులతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కీళ్ల నొప్పులకు జీవన శైలి, ఆహారమే కాదు నిర్లక్ష్యమూ ఓ కారణమే.

మోకాలి నొప్పులు: కొందరిలో మోకాలి కీలులోని కార్టిలేజ్ అరుగుతుంది. దీని వల్ల కీళ్లలోని ఎముకల మధ్య రాపిడి జరుగుతుంది. అప్పుడు కీలులో నొప్పి కలుగుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఈ నొప్పి వల్ల రోగి లేవడం, నడవడం కష్టంగా ఉంటుంది. వయసు రీత్యా వచ్చే ఈ సమస్యను ప్రారంభదశలోనే గుర్తించి, పీఆర్‌పీ థెరపీ చేస్తే.. సర్జరీ అవసరమే ఉండదు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే, రోగం ముదిరిన తర్వాత చికిత్స చేయాలంటే శస్త్ర చికిత్స ద్వారా కీలు మార్పిడి చేయడమే పరిష్కారం.

భుజం నొప్పి: భుజాల్లోని టెండాన్ (ఎముకను అతుక్కుని ఉండే కం డరాల అంచు)కు పగుళ్లు రావడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడుతుంది. అంటే ఎముకను అతుక్కునే కండ రం చివరి భాగం దెబ్బతిని, ఎర్రగా మారుతుంది. అందువల్ల భుజంలో నొప్పి కలుగుతుంది. చేతిని అటూ, ఇటూ, పైకి, కిందికి కదిలించేటప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉంటే చేయి కదిలించడం కష్టం. చేతిని కదల్చలేని 'ఫ్రోజన్ షోల్డర్' అంటారు. ఈ సమస్యను సకాలంలో గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో నివారించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే సర్జరీ తప్పదు.

ఎవ్యాస్క్యులర్ నెక్రోసిస్ ఆఫ్ హిప్: కరోనా చికిత్సలో స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల ఈ సమస్యతో బాధపడే రోగుల సంఖ్య కోవిడ్ తర్వాత పెరిగింది.

స్టెరాయిడ్స్ వాడితే తుంటిలోని కీళ్లలో రక్త ప్రసరణ తగ్గుతుంది. తుంటిలోని ఎముక కుళ్లుతుంది. నొప్పి తీవ్రంగా బాధిస్తుంది. తుంటిని కదిలించలేరు. ఈ సమస్య చిన్న వయసులో వస్తే వారికి పీఆర్‌పీ చికిత్స ఉత్తమమైన పద్ధతి.

టెన్నిస్ ఎల్బో సమస్య: మోచేతిలోని ఒక చిన్న ఎముకతో ఐదు కండరాలు అనుసంధానమవుతాయి. ఈ కండరా లను 'కామన్ ఎక్స్‌టెన్షన్ టెండాన్'అంటారు. ఆట లు ఆడినప్పుడు, ఏదైనా దెబ్బ తగిలినప్పుడు ఆ కండరాలు ఎముకతో అనుసంధానమైన చోట పగుళ్లు ఏర్పడతాయి. అందువల్ల తీవ్రమైన నొప్పి కలుగుతుంది. ఆటలు ఆడలేరు. అలాంటి వారికి శస్త్ర చికిత్స అందుబాటులో లేదు. వారికి పీఆర్‌పీ థెరపీతో ఉపశమనం ఉంటుంది.

అరికాళ్లలో నొప్పి:అరికాళ్లలో నొప్పి (మడమ నొప్పి) ని 'ప్లాంటార్‌ఫేషి ఐటీస్' అంటారు. ఎక్కువగా నడవడం వల్ల, చెప్పులు లేకుండా పనిచేయడం వల్ల, గరుకు ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవడ టం వల్ల మడమలో ప్లాంటర్ పొర తెగుతుంది. అప్పుడు మడమ (అరికా ళ్ల)లో తీవ్రమైన నొప్పి కలుగుతుంది. నడవడం కష్టమవుతుంది. ఈ సమస్యకు కూడా సర్జరీ లేదు. పీఆర్‌పీ థెరపీ చక్కటి పరిష్కారం.

ప్రారంభ దశలో..: కొంతమంది 30 నుంచి 40 ఏళ్ళ మధ్య వయసులో జాయింట్ పెయిన్స్ వస్తే.. అవగాహన లేక పట్టించుకోరు. ఉపశమనం కోసం ఆయింట్‌మెంట్లు రాసుకుంటారు. నూనెలతో మర్దనా చేసుకుంటారు.

కొంతమంది నొప్పుల మాత్రలు వాడతారు. ఇవి వాడటం వల్ల తాత్కాలిక ఉపశమనం కలుగుతు ంది. కొన్నిరోజుల తర్వాత సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ఇంకొందరు కొన్ని ప్రత్యేక వ్యాయామాల ద్వారా తగ్గించుకోవచ్చని ప్రయత్నాలు చేస్తుంటారు. వ్యాయామాలతో కీళ్ల నొప్పులు తగ్గకపోవడమే కాకుండా తీవ్రమవుతాయి.

అందుకని తరచూ నొప్పులు వచ్చినా లేక దీర్ఘకాలంగా నొప్పులు బాధిస్తున్నా వైద్యులను సంప్రదించాలి. ఎక్స్‌రే లేదా స్కానింగ్ తీయించుకోవాలి. ఇబ్బందిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో ఆదిలోనే సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు. కీళ్ల సమస్యల లక్షణాలు: కీళ్లలో తీవ్రమైన నొప్పి రావడం, 15 రోజుల పాటులేదా తరచూ నొప్పి ఉంటే కీళ్లలో డ్యామేజ్ ఉందేమోనని అనుమానించాలి. కీళ్లను కదిలించలేకపోవడం, కీళ్లలో వాపు.

మణికట్టు, భుజం, చీలమండ, భుజంలో తీవ్రమైన నొప్పి పీఆర్‌పీ థెరపీ ఎలా చేస్తారు?: 'ప్లేట్‌లెట్స్ రిచ్ ప్లాస్మా' థెరపీని 'పీఆర్‌పీ థెరపీ' అంటారు. ఇది పాత చికిత్సా పద్ధతే! కొన్ని కారణాల వల్ల ఈ పద్ధతి ప్రాచుర్యంలో లేదు. ఐదారేళ్ల నుంచి ఈ చికిత్సా విధానానికి ఆదరణ పెరుగుతున్నది. ఈ థెరపీ గురించి అనేక పరిశోధనలు జరిగాయి. మెరుగైన ఫలితాలు గుర్తించడంతో దీనికి మళ్లీ డిమాండ్ పెరిగింది. ఈ పీఆర్‌పీ చికిత్సా పద్ధతిలో రోగి నుంచి 20 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. ఆ రక్తాన్ని ఒక టెస్ట్ ట్యూబ్‌లో నింపిన తర్వాత పీఆర్‌పీ సెంట్రిఫ్యూజ్ మెషిన్‌లో తిప్పుతారు. రక్తం నుంచి 'గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్' వేరవుతాయి. ఈ సెల్స్‌ను దెబ్బతిన్న కీలు



భాగంలోకి ఇంజెక్షన్ ద్వారా ఇస్తారు. కార్టిలేజ్ దెబ్బతిన్న భాగంలోకి గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్'ని పంపడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. కార్టిలేజ్ రీ మోడలింగ్ (పునరుత్పత్తి) జరుగుతుంది. ఈ విధంగా సమస్య తీవ్రతను బట్టి రెండు లేదా మూడు సార్లు పీఆర్‌పీ థెరపీ చేయాల్సిన అవసరం ఉంటుంది. థెరపీ అనంతరం మూడు నుంచి నాలుగు నెలలపాటు వైద్యుల పరిశీలన (ఫాలో అప్) అవసరం. థెరపీ అనంతరం కొన్ని జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటించాలి. వైద్యులు సూచించిన వ్యాయామాలు చేయాలి. క్రీడల్లో గాయపడ్డ వారికి కూడా పీఆర్‌పీ థెరపీ మంచి ఫలితాలు ఇస్తుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215